



జిల్లా ఆస్పత్రిలో గదులులేక ఆవరణంలో కోవిడ్‌కోసం ఏర్పాటు చేసిన షెడ్‌లో నిర్వహిస్తున్న బాలింతలవార్డు

ప్రసవం కోసం వచ్చే మహిళల ఇబ్బందులు ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. జిల్లా సర్వజన వైద్యశాలకు టీడీపీ ప్రభుత్వం మంజూరు చేయించిన ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్లక్ష్యం మహిళల పాలిట శాపంగా మారింది. అప్పట్లో రూ.300 కోట్లు మంజూరైనా.. భవనాల నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం చొరవ చూపలేదు. దీంతో ప్రస్తుతం నిధులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఫలితంగా ఉమ్మడి జిల్లాతోపాటు సరిహద్దు ప్రాంతాల నుంచి అనంతపురం పెద్దాసుపత్రికి ప్రసవం కోసం వచ్చే మహిళలు మంచానికి ఇద్దరు, రెండు మంచాలకు ముగ్గురు చొప్పున సర్దుకునే దుస్థితి కొనసాగుతోంది. మాతాశిశు సంరక్షణ కోసం అప్పట్లో టీడీపీ ప్రభుత్వం చేసిన కృషి బూడిదలో పోసిన పన్నీరైంది. కథ మళ్లీ మొదటికి వచ్చింది. ఇంకొక్కసారి టీడీపీ కూటమి ప్రభుత్వం చొరవ చూపితే తప్ప తల్లీబిడ్డల కష్టాలు తీరేలా లేవు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం టౌన్

ఎన్నాళ్లీ పురిటి నొప్పులు..?

ప్రత్యక్ష నరకం

పెద్దాసుపత్రి ప్రసూతి విభాగంలో అధికారిక లెక్కల ప్రకారం 90 పడకలు ఉన్నాయి. అడ్మిషన్‌లో రోజుకు సగటున 300 మంది మహిళలు ఉంటున్నారు. ఈ లెక్కన.. పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. రోజుకు 30 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. మరో 20 మంది ప్రసవం కోసం ముందుగానే వస్తున్నారు. సాధారణ కాన్పు అయ్యేవారు మూడు రోజులు, సిజేరియన్ అయితే వారంరోజులు ఆస్పత్రిలోనే ఉండాల్సి వస్తోంది. రెండు రోజుల క్రితం 271 మంది బాలింతలు ప్రసూతి విభాగంలో ఉన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది దిక్కుతోచక.. ఉన్న పడకలపైనే అందరినీ సర్దుతున్నారు. ఒక మంచంపై ఇద్దరు, రెండు మంచాలను దగ్గరకు చేర్చి ముగ్గురు బాలింతలను, శిశువులను పడుకోబెడుతున్నారు. ప్రసూతి వార్డులో ఉంటున్న పచ్చి బాలింతలు, నవజాత శిశువులకు నరకం కనిపిస్తోంది. ఈ పరిస్థితి సుమారు పదేళ్ల నుంచి ఉంది. అందుకే 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేకంగా మాతాశిశు సంరక్షణ విభాగం(ఎంసీహెచ్) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అదే సమయంలో సర్జికల్ బ్లాక్ ఏర్పాటు ఆలోచన చేశారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి.. సర్వజన వైద్యశాలలో సర్జికల్, ఎంసీహెచ్ విభాగాల ఏర్పాటుకు రూ.300 కోట్లు మంజూరు చేయించారు. కానీ ఎన్నికలలో టీడీపీ ఓడిపోవడం, వైసీపీ అధికారంలోకి రావడంతో అప్పటిదాకా జరిగిన కృషి బూడిదలో పోసిన పన్నీరు అయింది.

ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణంపై నీలినీడలు

- టీడీపీ హయాంలో రూ.300 కోట్లు మంజూరు
- ఐదేళ్లు అలసత్వం వహించిన వైసీపీ ప్రభుత్వం
- పీజీ సీట్ల ఆధారంగానే ఇప్పుడు కేంద్రం నిధులు
- ప్రసూతి విభాగంలో బాలింతలకు నరక యాతన
- కూటమి ప్రభుత్వం చొరవ చూపితేనే పరిష్కారం



జిల్లా ఆస్పత్రిలోని కాన్పులవార్డు

ఐదేళ్లు వృథా..

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2020లో ఆ పనులకు టెండర్లు పిలిచారు. రూ.300 కోట్ల పనులను మేఘా కన్‌స్ట్రక్షన్ కంపెనీ దక్కించుకుంది. జలవనరులు, రోడ్లు భవనాల శాఖ కార్యాలయాలు ఉంటున్న స్థలంలో సర్జికల్, ఎంసీహెచ్ బ్లాక్‌ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఆ స్థలాలు ప్రభుత్వ వైద్యశాలవి కావడంతో ఖాళీ చేయాలని రెండు శాఖల అధికారులకు నోటీసులు ఇచ్చారు. జలవనరుల శాఖ ఖాళీ చేయడంతో.. పాత భవంతిని కూలగొట్టి, సర్జికల్ బ్లాక్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇప్పటికీ పూర్తి కాలేదు. నత్త నడకన సాగుతున్నాయి. అత్యంత కీలకమైన ఎంసీహెచ్ బ్లాక్‌ను ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఉన్నచోట నిర్మించాలని ప్లాన్ తయారు చేశారు. ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చినా.. ఆ శాఖ అధికారులు స్పందించలేదు. ఇప్పటికీ ఆర్‌అండ్‌బీ కార్యాలయం అక్కడే కొనసాగుతోంది. ఎంసీహెచ్ బ్లాక్ పనులు మొదలే కాలేదు.



ఆస్పత్రిలో మంచాలులేక అవస్థలు పడుతున్న బాలింతలు

నిధులపై తిరకాసు

టీడీపీ ప్రభుత్వం అప్పట్లో మంజూరు చేయించిన రూ.300 కోట్ల నిధులపై నీలి నీడలు కమ్ముకున్నాయి. సర్జికల్, ఎంసీహెచ్ బ్లాక్‌ల నిర్మాణానికి ఆ నిధులను కేటాయించారు. ఇందులో కేంద్రం వాటా 60 శాతం, రాష్ట్ర వాటా 40 శాతం ఉండాలని నిర్ణయించారు. కానీ ఇప్పుడు ఆ నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేసే అవకాశం లేదని అధికారుల ద్వారా తెలిసింది. మెడికల్ కాలేజీ పీజీ సీట్లకు అనుగుణంగా నిధులు ఇవ్వాలని కేంద్రం నిర్ణయించినట్లు సమాచారం. సర్జికల్ బ్లాక్ నిర్మాణ పనులు మొదలు కావడంతో ఇప్పటి వరకూ రూ.78 కోట్లు మాత్రమే వచ్చాయి. దీంతో జీ ప్లస్ 6 భవన నిర్మాణం కాస్తా జీ ప్లస్ వన్‌కు పరిమితమైంది. గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్ వరకు మాత్రమే నిర్మిస్తున్నామని ఇంజినీరింగ్ అధికారులు అంటున్నారు. సర్జికల్ బ్లాక్ పరిస్థితే ఇలా ఉంటే.. ఇక నిర్మాణమే మొదలుకాని ఎంసీహెచ్ బ్లాక్ పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు. వైసీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్న విమర్శలు వస్తున్నాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపితేగానీ ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణం కార్యరూపం దాల్చేలా లేదు.



నిధులు వచ్చినపుడల్లా నిర్మాణం..

జిల్లా ఆస్పత్రి సర్జికల్, ఎంసీహెచ్ బ్లాక్‌ల నిర్మాణానికి రూ.300 కోట్లు కేటాయించారు. వైసీపీ ప్రభుత్వంలో ఈ పనులకు టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి, పనులను ప్రారంభించాము. ఇప్పటి వరకు రూ.78 కోట్లు మాత్రమే వచ్చాయి. ఆ నిధులతో సర్జికల్ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ నిర్మిస్తున్నాం. మెడికల్ కాలేజీలో రెండు హాస్టల్ భవనాలను నిర్మిస్తున్నాము. పీజీ సీట్ల ఆధారంగా మిగిలిన నిధులు వస్తాయి. ఆ నిధులు వచ్చినట్లల్లా పనులు చేపడతాము.

- నాయుడు, ఈఈ, ఏపీఎంఎస్ఐడీసీ

ఖాళీ చేయడం లేదు..

ఎంసీహెచ్ బ్లాక్‌ను ఆర్ అండ్ బీ కార్యాలయం ఉన్న చోట నిర్మించాలని నిర్ణయించారు. ఖాళీ చేయాలని ఆ శాఖ అధికారులకు అప్పట్లోనే ప్రభుత్వం ఆదేశించింది. ఆర్ అండ్ బీ కార్యాలయం కోసం మేము శారదా నగర్‌లో ఉన్న క్యాన్సర్ ఆస్పత్రి వద్ద ఆరు గదులను కేటాయించాము. కానీ వారు ఖాళీ చేయడంలేదు. ఈ విషయం ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు తెలుసు. నిధుల విషయం మాకు తెలియదు. భవనం నిర్మించి ఇస్తే వెంటనే అక్కడ ప్రసూవి విభాగం సేవలు అందిస్తాం.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్



వైసీపీ నిరసనలు.. మమ

- జగన్ పిలుపునిచ్చినా స్పందించని శ్రేణులు



ఎస్‌ఈకి వినతిపత్రం సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంత తదితరులు

అనంతపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా వైసీపీ చేపట్టిన నిరసన కార్యక్రమాలు తూతూ మంత్రంగా సాగాయి. అధికారంలో ఉన్నప్పుడు పార్టీ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా వేలాదిగా వచ్చిన శ్రేణులు ఇప్పుడు ముఖం చాటేశాయి. వైసీపీ అధినేత జగన్ పిలుపునిచ్చినా శ్రేణుల్లో ఎక్కడా ఉత్సాహం కనిపించలేదు. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో శుక్రవరం నిర్వహించిన ర్యాలీలు, ధర్నాలలో కార్యకర్తలు, నాయకులు పలుచగా కనిపించారు. ట్రూ అప్ చార్జీల పేరుతో వైసీపీ హయాంలోనే విద్యుత్ చార్జీల పెంపునకు బీజం పడిందని ఆ పార్టీలోని కొందరు ముఖ్యులే వ్యాఖ్యానించారు. అనంతపురం అర్బన్‌లో మినహా మిగిలిన నియోజకవర్గాల్లో మమ అనిపించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో పాతూరులోని బ్రహ్మంగారి గుడి వద్ద నుంచి పవర్ ఆఫీసు వరకూ ర్యాలీ నిర్వహించారు. విద్యుత్‌శాఖ అధికారులకు వినతి పత్రం అందించారు. ర్యాలీలో కార్యకర్తల కంటే ప్లకార్డులే అధికంగా కనిపించాయి. రాప్తాడులో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కళ్యాణదుర్గంలో మాజీ ఎంపీ రంగయ్య, స్థానిక నాయకుడు ఉమామహేశ్వరనాయుడు, గుంతకల్లులో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఉరవకొండలో నియోజకవర్గ ఇన్‌చార్జి విశ్వేశ్వరరెడ్డి, రాయదుర్గంలో మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందురెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. తాడిపత్రిలో పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రమేష్‌రెడ్డి మరికొంత మంది నాయకులతో వాహనాల్లో వెళ్లి స్థానిక విద్యుత్‌శాఖాధికారులకు వినతి పత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి గైర్హాజరయ్యారు. శింగనమలలో ముఖ్య నేత ఆలూరు సాంబశివారెడ్డి, సమన్వయకర్త వీరాంజనేయులు స్థానిక నాయకులతో కలిసి నిరసన తెలిపారు. పార్టీ శ్రేణులు పెద్దగా హాజరుకాకపోవడంతో నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ద్వితీయశ్రేణి నాయకులు నిరుత్సాహానికి గురయ్యారు.

మన్మోహన్‌కు 'ఉపాధి' నివాళి



పని ప్రదేశంలో సంతాపం తెలుపుతున్న ఉపాధి కూలీలు

కళ్యాణదుర్గం రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించి తమ కష్టాలు తీర్చిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు మల్లిపల్లిలో ఉపాధి కూలీలు ఘన నివాళులు అర్పించారు. పని ప్రదేశంలో శుక్రవారం మౌనం పాటించారు. దాదాపు 500 మంది కూలీలు గ్రామ సమీపంలో ఉపాధి పనులు చేస్తున్నారు. ఈ పనులను 2006లో ప్రధాని హోదాలో మన్మోహన్ సింగ్ ప్రారంభించారని గుర్తు చేసుకున్నారు. ఉపాధి పనుల కారణంగా వలసలు వెళ్లే బాధ తప్పిందని అన్నారు. సర్పంచ్ గీతాంజలి, మాజీ సర్పంచ్ చిక్కన్న తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మళ్లీ దొరికిన మందు




స్వాధీనం చేసుకున్న డిఫెన్స్ మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ అధికారులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖ పోలీసులు రెండో రోజూ డిఫెన్స్ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విశ్రాంత ఆర్మీ ఉద్యోగి నుంచి 74 ఫుల్ బాటిళ్లను శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఫెర్రర్ నగర్‌లో విశ్రాంత ఆర్మీ ఉద్యోగి వడ్డే శ్రీనివాసులు ఇంట్లో ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు జయనరసింహ, జాకీర్ హుస్సేన్, హెడ్ కానిస్టేబుళ్లు విజయ భాస్కర్, శివప్రసాద్, కానిస్టేబుళ్లు రమేష్, కృష్ణా నాయక్, ఎర్రిస్వామి తనిఖీ చేశారు. ఇంట్లో నిల్వ ఉంచిన పలు బ్రాండ్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేశారు. బెంగళూరు నుంచి డిఫెన్స్ మద్యం బాటిళ్లను జిల్లాకు తెచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. కళ్యాణదుర్గం రోడ్డులో గురువారం ఓ వ్యక్తి నుంచి 69 డిఫెన్స్ మద్యం ఫుల్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

ఐపీఎస్‌లు న్యాయం వైపు నిలబడాలి

తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి



అనంతపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఐపీఎస్ అధికారులు న్యాయం వైపు నిలబడాలని మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కోరారు. పరువుకోసం తాను అన్నీ పోగొట్టుకున్నానని, ఎవరికీ తలవంచనని అన్నారు. తాడిపత్రి అభివృద్ధి కోసం తలవంచకుండా పనిచేస్తామని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎంతో నష్టపోయానని అన్నారు. అనంతపురంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'మా లారీ వాళ్లు, ఉద్యోగులు, కార్మికులు కొన్నిరోజులు జరుగుతున్న పరిణామాలతో నష్టపోయారు. అల్ట్రాటెక్ యాజమాన్యం, ఇతర సిమెంట్ ఫ్యాక్టరీ నిర్వాహకులకు క్షమాపణలు చెప్తున్నారు' అని అన్నారు. తాము డబ్బుల కోసం రాజకీయాల్లోకి రాలేదని, తన తండ్రికి చవర్‌లెట్ వాహనం, తన తల్లికి డైమండ్స్ కంపెనీ ఉండేదని అన్నారు. '1951లోనే మా నాన్న మా అక్కను మద్రాసు స్కూల్‌లో చేర్పించారు. 1969లో కాలేజీలో చేరితే మా నాన్న నాకు కారిచ్చాడు. నా పొలం అమ్ముకుంటే కోట్లు వస్తాయి. మేము లేనోళ్లమా..? మేము ఇప్పుడేదో సంపాయిచ్చినట్లు ఏదేదో మాట్లాడుతున్నారు..' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము 128 బస్సులకు ఆల్ ఇండియా పర్మిట్ పోగొట్టుకున్నామని అన్నారు. 'అందరు సీఎంలు ఇప్పుడు ల్యాండ్‌క్రూజర్ తీసుకున్నారు. నాకు తెలిసి నేను రూ.55 లక్షల ధర ఉన్నప్పుడే ఆ కారు కొన్నాను..' అని అన్నారు. డబ్బుల కోసం పాలిటిక్స్ చేయాల్సిన అవసరం జేసీ కుటుంబానికి లేదని స్పష్టం చేశారు. డీజీపీ ద్వారకా తిరుమలరావు, పోలీసు ఉన్నతాధికారులు మహేష్‌చంద్ర లడ్హా, కర్నూలు, అనంతపురం డీఐజీలు, ఎస్పీలు జగదీష్, విద్యాసాగర్‌నాయుడుకు తనకు జరిగిన అన్యాయం గురించి చెప్పానని, న్యాయం చేయాలని కోరానని అన్నారు. తన లారీలు ఫ్యాక్టరీలోనే ఉన్నాయని, అద్దాలను పగులగొట్టారని అన్నారు. అల్ట్రాటెక్‌లో జనం ఇబ్బంది పడుతున్నారని, ఆ కంపెనీపై ఆధారపడి 40వేల మంది బతుకుతున్నారని అన్నారు.

ఒక్కరోజు ముందే పింఛన్



అనంతపురం టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): జనవరి నెల ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఒక్క రోజు ముందే, ఈ నెల 31న పంపిణీ చేస్తామని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణశర్మ శుక్రవారం తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, మత్స్యకారులు, డప్పు కళాకారులు, చర్మకారులు, ఎయిడ్స్ బాధితులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు తదితర లబ్ధిదారులకు పింఛన్ ఇస్తామని అన్నారు. జిల్లాలో 2,83,459 మంది అర్హులు ఉన్నారని తెలిపారు. వీరి కోసం ప్రభుత్వం రూ.124.99 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. సచివాలయ సిబ్బంది ఇళ్లవద్దకే వచ్చి పింఛన్ పంపిణీ చేస్తారని, ఎవరూ కార్యాలయాల వద్దకు రావాల్సిన అవసరం లేదని అన్నారు.

మరింత ధాన్యం కొనాలని ఆదేశించండి

- ముఖ్యమంత్రికి కాలవ లేఖ

రాయదుర్గం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 20 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని సీఎం చంద్రబాబుకు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు లేఖ రాశారు. జిల్లా రైతాంగం అనేక ఒత్తిళ్ల నడుమ పంటలు పండిస్తోందని, మార్కెట్‌లో మంచి ధర లభించనప్పుడు ప్రభుత్వం ఆదుకుంటుందన్న అన్నదాతల విశ్వాసానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ధాన్యం సేకరణలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై శుక్రవారం ఆయన ముఖ్యమంత్రికి లేఖ పంపారు. నిత్యం రైతు సంక్షేమం గురించి ఆలోచించే సీఎం, కష్టకాలంలో వారికి మద్దతుగా నిలుస్తుండటం సంతోషకరమని పేర్కొన్నారు. మద్దతు ధరతో ధాన్యం సేకరణకు అనుమతి ఇవ్వటమే కాక కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాలలో డబ్బు జమ చేస్తుండటంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. జిల్లాలో ఇప్పటిదాకా 7,500 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు మాత్రమే సివిల్ సప్లై అధికారులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, జిల్లాలో ఈ ఏడాది 37,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఉత్పత్తి చేశారని పేర్కొన్నారు. అందులో 80 శాతం రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లోనే రైతులు పండిస్తున్నారని పేర్కొన్నారు. రైతులందరికీ ప్రయోజనం చేకూరేలా అదనంగా మరో 12,500 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరణకు ఆదేశాలు ఇవ్వాలని విన్నవించారు.











అతి విశ్వాసం, అధికార గర్వంతో విర్రవీగిన వైసీపీకి జిల్లా ప్రజలు షాక్ ఇచ్చారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలు ఆపార్టీకి పీడకలను మిగిల్చాయి. దౌర్జన్యాలు, అరాచకాలతో పాలన సాగించిన ఫ్యాన్ పార్టీ రెక్కలు ఓటరు తీర్పుతో విరిగిపోయాయి. కూటమిగా జట్టు కట్టి బరిలో నిలిచిన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల దెబ్బకు వైసీపీ అడ్రస్ లేకుండా పోయింది. ఐకమత్యంగా సాగిన ఆపార్టీలు ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంటు స్థానాలతో పాటు 14 అసెంబ్లీ స్థానాలను గెలుచుకున్నాయి. ఎన్నికల విజయం తర్వాత ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురికి అమాత్య పదవులు సైతం దక్కాయి. ఉమ్మడి జిల్లాలో అంతంతమాత్రంగానే బలం ఉన్నా టీడీపీతో జట్టు కట్టడం వల్ల జనసేన, బీజేపీలు బాగా లాభపడ్డాయి. నామినేటెడ్ పదవుల్లో సైతం ఆపార్టీలకు మంచి ప్రాధాన్యం దక్కింది.

2024 మెరుపులు వెలుగులు 2



కూటమి ఐక్యతారాగం

ధర్మవరం ఎన్నికల ప్రచార సభలో (ఫైల్)

క్లీన్‌స్వీప్

ఉమ్మడి జిల్లాలో టీడీపీ కూటమి అద్భుత విజయం

మొత్తం ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలు కైవసం
అనంత రాజకీయ చరిత్రలో తిరుగులేని ఘనత
అధికార గర్వంతో చతికిలపడ్డ వైసీపీ
నామినేటెడ్‌లోనూ కూటమి నేతలకు పదవులు
నేతల రాతను మార్చిన 2024

అనంతపురం/ పుట్టపర్తి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒకే ఏడాదిలో రెండు ప్రభుత్వాలను చూపించిన ఘనత 2024కి దక్కుతుంది. ఈ ఏడాది జిల్లా ప్రజలు టీడీపీ కూటమికి తిరుగులేని విజయాన్ని అందించారు. జిల్లాలోని 8 నియోజక వర్గాల్లో న రా కూట మిలో భాగస్వామి అయిన టీడీపీ అభ్యర్థులకే జిల్లా ప్రజానీకం పట్టం కట్టారు. పార్లమెంటు స్థానం కూడా టీడీపీకే చిక్కింది. సెంటిమెంట్‌ను తిరగరాస్తూ ఉరవకొండ నుంచి ఎమ్మెల్యేగా పయ్యావుల కేశవ్ గెలిచి చంద్రబాబు కేబినెట్‌లో కీలకమైన ఆర్థికశాఖను దక్కించుకోవడం ఈఏడాది రాజకీయంగా ఎ ం లో విశేషం.

ఈ ఏడాది ఆరంభం నుంచే ఎన్నికల హడావుడి ప్రారంభమైంది. అప్పటి వరకూ స్తబ్దుగా ఉన్న తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసేందుకు, ఆ పార్టీ నేతలను మేల్కొల్పేందుకు టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన పాదయాత్ర ఎంతగానో ఉపయోగపడింది. ఆ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా, ఎంపీలుగా పోటీ చేసేందుకు ఆశావహుల సంఖ్య పెరగడమే ఇందుకు ఉదాహరణ.

ఎదురులేని టీడీపీ

ఈ నేపథ్యంలోనే టిక్కెట్ ఆశించిన పలువురు నారా లోకేశ్ పాదయాత్రలో ఎవరికి వారు తమ బలాలను చూపించుకునేందుకు పోటీపడ్డారు. పాదయాత్ర జిల్లా సరిహద్దు దాటినప్పటికీ ఆయనకు మరింత దగ్గరకావాలనే యోచనలోనే ఆ పార్టీ నేతలు అప్పుడప్పుడు ఇతర జిల్లాలకు వెళ్లొచ్చారు. మరోవైపు చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఎవరికి వారు ఆందోళనలు చేశారు. అయితే అభ్యర్థుల ప్రకటనతో కొందరికి మోదం, మరికొందరికి ఖేదం మిగిలింది. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడింటిలో కొత్తవారికి టిక్కెట్లు కేటాయించారు. అందులో అనంతపురం అర్బన్ నుంచి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, కళ్యాణదుర్గం నుంచి అమిలినేని సురేంద్రబాబు, గుంతకల్లు నుంచి అనూహ్యంగా వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన గుమ్మనూరు జయరాంను టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దింపారు. మిగిలిన ఐదు నియోజకవర్గాల నుంచి పాతవారినే పోటీలో ఉంచారు. రాప్తాడు నుంచి పరిటాల సునీత, ఉరవకొండ నుంచి పయ్యావుల కేశవ్, రాయదుర్గం నుంచి కాలవ శ్రీనివాసులు, తాడిపత్రి నుంచి జేసీ అస్మిత్‌రెడ్డి, శింగనమల నుంచి బండారు శ్రావణిశ్రీ పోటీచేశారు. కూటమి పార్టీల సహకారంతో మొత్తం అన్ని స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకున్నారు. జిల్లా చరిత్రలో అన్ని నియోజకవర్గాల్లోనూ స్వీప్ చేసిన పార్టీగా టీడీపీ నిలిచింది.

కలిసొచ్చిన పొత్తు

సార్వత్రిక ఎన్నికల ముందువరకూ తెలుగుదేశం పార్టీ ఒంటరిగానే వైసీపీ పాలనపై పోరుబాట సాగించింది. అదే తరహాలో జనసేన శ్రేణులు విడిగానే వైసీపీ పాలనపై పోరాటాలు చేశాయి. బీజేపీ సైతం అడపాదడపా వైసీపీ పాలనను ఎండగడుతూ వచ్చింది. చంద్రబాబు అరెస్టుతో జనసేనాని పవన్‌కళ్యాణ్ బహిరంగంగా టీడీపీతో పొత్తును ప్రకటించారు. ఆ తరువాత కొన్ని రోజులకు బీజేపీతోనూ పొత్తు ఏర్పడింది. ఎన్డీఏ కూటమిగా మూడు పార్టీలు కలిసి సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచి, గెలిచాయి. ఎన్నికల పొత్తు బీజేపీ, జనసేనలకు బాగా కలిసొచ్చింది. కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో అటు బీజేపీ, ఇటు జనసేన నాయకులకు అధికారంలోనూ భాగస్వామ్యం లభించింది. మరీ ముఖ్యంగా అధికార యంత్రాంగంలోనూ గుర్తింపు పెరిగింది.



కేశవ్‌కు కలిసొచ్చిన కాలం

శ్రీసత్యసాయి జిల్లాలో..

శ్రీసత్యసాయి జిల్లాలో హిందూపురం పార్లమెంట్‌తో పాటు ఆరు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించారు. హిందూపురం, పెనుకొండ, రాప్తాడు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ భారీ ఆధిక్యం సాధించగా పుట్టపర్తి, కదిరిలో మంచి మెజార్టీ సాధించింది. కాగా మడకశిరలో మాత్రం ఎంఎస్ రాజు 425 ఓట్ల స్వల్ప మెజార్టీతో గెలిచారు. టీడీపీ, జనసేనతో జత కట్టిన కమలం ధర్మవరంలో వికసించింది. జిల్లాలో పార్లమెంట్‌తోపాటు ఐదుచోట్ల టీడీపీ కూటమి ఒకచోట బీజేపీ గెలుపుతో వైసీపీ అడ్రస్ గల్లంతయ్యింది. జిల్లాలో తొలిసారి బరిలోకి దిగినా అందరూ గెలిచి శాసనసభలో అడుగుపెట్టారు. తొలిసారి గెలిచినా ఇద్దరికి మంత్రి పదవులు సైతం దక్కాయి. అధికారం శాశ్వతమని భ్రమించి, అరాచక పాలన సాగించిన వైసీపీకి జిల్లాలో కోలుకోలేని దెబ్బతగిలింది.



ఎన్నికల ప్రచార సభలో బీకే, సవిత, నిమ్మల

2019 సార్వత్రిక ఎన్నికల్లో హిందూపురం అసెంబ్లీ మినహా అన్ని స్థానాల్లోనూ వైసీపీ గెలించింది. అంతకు మునుపు 2014 ఎన్నికల్లో కదిరిలో వైసీపీ గెలిచింది. ఐదేళ్ల వైసీపీ ఎమ్మెల్యేల అరాచక పాలనకు విసిగిపోయిన ప్రజలు వారిని ఇంటికి సాగనంపారు. ఎన్నికల్లో ధర్మవరం, రాప్తాడు, పుట్టపర్తితోపాటు కళ్యాణదుర్గం సిట్టింగ్ ఎమ్మెల్యేలను మళ్లీ బరిలోకి దింపి హిందూపురం అసెంబ్లీ, పార్లమెంట్, మడకశిర, కదిరి అసెంబ్లీ స్థానాలకు కొత్త ముఖాలను బరిలో దింపారు. హిందూపురం పార్లమెంట్ స్థానం నుంచి వైసీపీ

కూటమి దెబ్బకు..

అభ్యర్థిగా బళ్లారి మాజీ ఎంపీ(బీజేపీ) శాంతను పోటీకి దింపారు. పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణకు స్థాన చలనం కలిగించి, అనంతపురం ఎంపీగా పోటీ చేయించారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న ఉష శ్రీచరణ్‌ను పెనుకొండ నుంచి బరిలో నిలిపారు. ఎవరిని ఎక్కడకు మార్చినా, దిగుమతి చేసుకున్నా వైసీపీ ఆశలు ఫలించలేదు. పోటీ చేసిన ప్రతి చోటా ఓటమే పలకరించింది. ప్రస్తుతం జిల్లాలో వైసీపీ మాజీ ఎమ్మెల్యేల్లో కొందరు అప్పుడప్పుడు కన్పిస్తున్నా, ఓటమితో పార్టీ కేడర్ మొత్తం డీలా పడి ముఖం చాటేస్తోంది.



ఎన్నికలలో జగన్ ప్రచారం

చతికిలపడ్డ వైసీపీ

అంతవరకు అధికారం అండగా రంకెలేసిన వైసీపీ ఎన్నికల్లో చావుదెబ్బతింది. ఎన్ని వ్యూహాలు రచించినా, సామదానదండోపాయాలు ఉపయోగించినా ప్రజలు ఆ పార్టీ అభ్యర్థులను తిరస్కరించారు. పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ వైసీపీ అభ్యర్థులు ఘోరంగా ఓడిపోయారు. జగన్ కేబినెట్‌లో పని చేసిన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే ఉష శ్రీ చరణ్‌ను శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండకు పంపినా ఫలితం లేకపోయింది. అలాగే కళ్యాణదుర్గం నుంచి పోటీ చేసిన అప్పటి ఎంపీ తలారీ రంగయ్య కూడా ఘోరంగా ఓడిపోయారు. అనంతపురం అర్బన్ నుంచి అనంత వెంకటరామిరెడ్డి, ఉరవకొండ నుంచి విశ్వేశ్వరరెడ్డి, గుంతకల్లు నుంచి వై. వెంకటరామిరెడ్డి, తాడిపత్రి నుంచి కేతిరెడ్డి పెద్దారెడ్డి, రాప్తాడు నుంచి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిలకు ఓటర్లు నిర్మొహమాటంగా తిరస్కరించారు. వీరు ఎమ్మెల్యేలుగా కొనసాగినప్పుడు ఆయా నియోజకవర్గాల్లో సాగించిన అరాచకాలు, దౌర్జన్యాల ఫలితమే ఓటమి అనేది ఆ పార్టీ వర్గాల అభిప్రాయం. ఇక రాయదుర్గం ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా కొనసాగిన కాపు రామచంద్రారెడ్డికి టికెట్ దక్కలేదు. ఆ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే, అప్పటి ఏపీఐఐసీ ఛైర్మన్‌గా ఉన్న మెట్టు గోవిందురెడ్డిని ఎమ్మెల్యే అభ్యర్థిగా దింపినప్పటికీ ఓటమి తప్పలేదు.

ధర్మవరంలో కమల వికాసం

సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ జనసేన, బీజేపీ కూటమిగా జతకట్టడంతో అందరి అంచనాలను తలకిందుల చేస్తూ ధర్మవరం అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి గా పోటీ చేసిన సత్యకుమార్‌యాదవ్ ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం బీజేపీ కోటాలో మంత్రి పదవి కూడా దక్కించుకున్నారు. ధర్మవరంలో అంతంతమాత్రంగానే ఉన్న బీజేపీ కూటమిలో భాగస్వామిగా మారడంతో అద్భుత విజయం సాధించింది. వైసీపీ గట్టి పోటీ ఇచ్చినా కూటమి అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ 3734 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఇక్కడ టీడీపీ, జనసేన ఓటు బ్యాంకు బీజేపీకి బాగా బదిలీ కావడంతో ధర్మవరంలో కమలం వికసించింది.

ఐకమత్యంగా విజయం

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ జట్టుగా ఏర్పడటం విజయానికి బాగా కలిసొచ్చింది. జిల్లాలో జనసేన పార్టీ నిర్మాణం లేకపోయినా, ఉనికి అంతమాత్రం ఉన్న బీజేపీలు టీడీపీతో జతకట్టడం బాగా లాభించింది. ఎన్నికల్లో విజయం తర్వాత నామినేటేడ్ పదవుల్లో మొదటి, రెండో విడతల్లో సైతం జనసేన, బీజేపీ శ్రేణులకు ప్రాధాన్యం కల్పించారు. ఇటీవల జరిగిన సాగునీటి ఎన్నికల్లో జనసేన, బీజేపీ శ్రేణులకు అధ్యక్ష, ఉపాధ్యక్ష, సభ్యుల్లో ప్రాధాన్యం దక్కింది. ఇదే ఉత్సాహంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్ష ఫలితాలు సాధించేలా కూటమి పార్టీ శ్రేణులు ముందుకు సాగుతున్నాయి.

నామినేటెడ్‌లో కూటమి నేతలకు పదవులు

సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అద్భుత విజయం సాధించి, అధికారాన్ని చేపట్టడంతో కూటమిలో భాగస్వాములైన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులకు నామినేటెడ్ పదవులు దక్కాయి. జిల్లాలో టీడీపీ ముఖ్య నేతలు, మాజీ ప్రజాప్రతినిధులకు రాష్ట్రస్థాయి ఛైర్మన్ పదవులు దక్కాయి. జడ్పీ మాజీ ఛైర్మన్ పూలనాగరాజుకు ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ పదవి దక్కగా, మాజీ ఎమ్మెల్సీ దీపకర్‌రెడ్డికి సీడాప్ ఛైర్మన్ పదవి లభించింది. ఇక జనసేన నుంచి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్‌కు అహుడా ఛైర్మన్ పదవి లభించింది. బీజేపీ నాయకుల్లో కొందరికి డైరెక్టర్ పోస్టులు దక్కాయి. మొత్తంగా రాజకీయంగా ఈ ఏడాది కూటమి పార్టీలు, ఆయా పార్టీల నేతలకు ఆనందాన్ని అందించగా, వైసీపీ నేతలకు నిరాశ, నిస్పృహను మిగిల్చింది.

అసెంబ్లీలోకి కొత్తముఖాలు

జిల్లాలో తొలిసారిగా నలుగురు కొత్త వారు ఎమ్మెల్యేలుగా గెలిచారు. పుట్టపర్తి నుంచి పల్లె సింధూరారెడ్డి, పెనుకొండ నుంచి సవిత, ధర్మవరం నుంచి సత్యకుమార్‌యాదవ్, మడకశిర నుంచి ఎంఎస్‌రాజులు తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. మడకశిర ఎస్సీ రిజర్వుడ్ నియోజక వర్గం టీడీపీ కూటమి అభ్యర్థిగా ప్రకటించిన సునీల్‌కుమార్ బదులుగా శింగనమలకు చెందిన రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎంఎస్ రాజును తెరపైకి తెచ్చారు. అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత కేవలం 23 రోజుల్లోనే ఎంఎస్‌రాజు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆపై టీటీడీ పాలక మండలి సభ్యుడిగా నియమితులయ్యారు. పొత్తులో బీజేపీ కోటా కింద ధర్మవరం నుంచి సత్యకుమార్‌యాదవ్ రంగంలోకి దిగి తొలిసారిగా ఎన్నికై మంత్రి పదవి చేపట్టారు. పెనుకొండ నుంచి సవిత బరిలో దిగి జిల్లాలో భారీ మెజార్టీతో గెలవడంతో పాటు మంత్రి పదవిని పొందారు. కాగా జిల్లా నుంచి మంత్రి పదవులు చేపట్టిన ఇద్దరూ బీసీ వర్గాలకు చెందిన వారే కావడం గమనార్హం.



ఉపాధి చూపిన మన్మోహన్


స్మరించుకున్న బండ్లపల్లి గ్రామస్థులు... మాజీ ప్రధాని మృతితో గ్రామంలో విషాదఛాయలు



ఉపాధి పనుల్లో నిమగ్నమైన కూలీలు..



దేశంలోనే మొట్టమొదటి జాబ్‌కార్డు



ఉపాధి హామీ పథకంతో మండలంలోని బండ్లపల్లి గ్రామం పేరు దేశనలు మూలల వినిపించింది. ప్రధాని హోదాలో దివంగత మన్మోహన్‌సింగ్ ఇక్కడికి వచ్చి పథకాన్ని ప్రారంభించారు. అప్పటి ఆయన పర్యటనను గ్రామస్థులు తీపి జ్ఞాపకంగా మనసులో నేటికీ ఉంచుకున్నారు. అయితే గురువారం రాత్రి ఆయన మరణవార్త విని బండ్లపల్లి గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు. పేద ప్రజలు వలస పోకుండా ఉన్న ఊరిలోనే వంద రోజులు పనులు చేసుకునేలా ఉపాధి హామీ పథకాన్ని తెచ్చిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఆపద్బాంధవుడని వారు కొనియాడుతున్నారు. ఆయన మృతి ఎంతో విచారకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - ఆంధ్రజ్యోతి, నార్పల

నా ఇద్దరు పిల్లలను బతికించుకున్నా



నాభర్త చీమల రాముడు అనారోగ్యంతో 22ఏళ్ల కిందట చనిపోయాడు. అప్పటికి నాకు ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. పనులు లేక, ఇద్దరు పిల్లలను ఎలా పోషించాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నా. ఆత్మహత్య శరణ్యం అనుకుంటున్న తరుణంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ దేవుడిలా ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి ఉపాధి పనులకు వెళ్లి, వచ్చిన ఆదాయంతో నా ఇద్దరు పిల్లలను పోషించుకున్నా. రెండున్నర ఎకరాల భూమిలో ఉపాధి పథకం ద్వారానే మామిడి చెట్లను సాగు చేశా. అలాంటి ఉపాధి పథకాన్ని తెచ్చిన మన్మోహన్‌సింగ్ లాంటి దేవుడు చనిపోవడం బాధాకరం.

- చీమల పెద్దక్క, తొలి జాబ్‌కార్డు పొందిన మహిళ

షేక్ హ్యాండ్ ఇచ్చారు



చేయడానికి పనులు లేని కాలంలో ప్రధాని హోదాలో మన్మోహన్‌సింగ్ మా ఊరికి వచ్చారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించారు. అప్పుడు నాకు షేక్ హ్యాండ్ ఇచ్చి, నా భుజం తట్టి మీరు ఎవరి దగ్గర పనులు చేయవద్దని ఉపాధి పనులు చేసుకోమని హిందీలో చెప్పారు. నాకు అర్థం కాకపోవడంతో అప్పటి కలెక్టర్ అనురాధ మేడం దాన్ని తెలుగులో చెప్పారు. ఉపాధి పనులు చేయడం ద్వారా వచ్చిన డబ్బులతోనే నా కూతురిని నర్సింగ్ కోర్సు చదివించా. ఆమెకు ఆర్టీటీలో ఉద్యోగం వచ్చిందన్నారు.

- బండారు బాలనరసింహులు

బెంగళూరులో డ్రైవర్‌గా పనిచేశా



కుటుంబాన్ని పోషించడం కోసం భార్య, పిల్లను వదిలి ఎనిమిదేళ్లుగా బళ్లారి, బెంగళూరులో డ్రైవర్‌గా పనిచేశా. ఒడిదుడుకుల మధ్య నిద్రలేని రాత్రులు గడిపా. ఎప్పుడైతే ఉపాధి హామీ పథకం వచ్చిందో అప్పటి నుంచి మా గ్రామానికి తిరిగి వచ్చా. ఉపాధి పనులకు వెళుతూ ఒక కుమార్తెకు పెళ్లి చేశా. మరో ఇద్దరు పిల్లలను టీటీసీ చదివిస్తున్నా. అద్భుతమైన ఉపాధి పథకాన్ని మాలాంటి పేదలకు అందించిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి ఎంతో బాధకలిగిస్తోంది.

-రామకృష్ణ, బండ్లపల్లి

బెంగళూరులో పాచిపనులకు వెళ్లా



ఉపాధి హామీ పథకం ప్రవేశ పెట్టకముందు ఊర్లో పనులు లేకపోవడంతో పూటగడవడం కోసం నేను, నా భర్త కలిసి బెంగళూరుకు వలస వెళ్లాం. అక్కడ నేనే పాచిపనులు చేసేదాన్ని. ఆరేళ్లు అక్కడే ఉన్నాం. ఉపాధి పథకం ద్వారా పనులు కల్పించారని తెలిసి సొంతూరికి వచ్చేశాం. అప్పటి నుంచి ఇక్కడే ఉంటూ నా భర్త ఎర్రప్పతో కలిసి ఉపాధి పనులు చేసుకుంటూ బతుకుతున్నాం.

-కుళ్లాయమ్మ, బండ్లపల్లి

తిరుపతి ప్యాసింజర్ రైలు రద్దు



గుంతకల్లు,డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): ప్రయాగ్ రాజ్ కుంభమేళాను పురస్కరించుకుని కదిరిదేవరపల్లి-తిరుపతి ప్యాసింజర్‌ను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. కుంభమేళాకు భక్తుల తరలింపు కోసం కొన్ని రైళ్లను అక్కడికి నడపనున్నట్లు పేర్కొన్నారు. ఈ కారణంగా ఈనెల 29నుంచి మార్చి1 వరకు తిరుపతి ప్యాసింజర్‌ను రద్దు చేసినట్లు తెలియజేశారు. దీంతో ఇదివరకే రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికుల టికెట్‌లను రద్దు పరిచినట్లు తెలియజేశారు.

'రబీ పంటల్లో సస్యరక్షణ చర్యలు తీసుకోండి'

అనంతపురం అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రబీలో సాగు చేసిన పలు రకాల పంటల్లో తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం, మెట్ట వ్యవసాయం ప్రధాన శాస్త్రవేత్త విజయ్ శంకర్‌బాబు, సేద్యవిభాగం సీనియర్ శాస్త్రవేత్త నారాయణస్వామి, రీసర్చ్ అసోసియేట్ ఉమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రబీలో సాగు చేసిన వేరుశనగ పంట ప్రస్తుతం మొలక దశ నుంచి పూత దశలో ఉందన్నారు. శాకీయ దశలోని పంటలో 15- 20 రోజులకు అంతర కృషి చేసి కలుపు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పంటలో సూక్ష్మపోషకాలైన జింక్, ఇనుప ధాతు లోపం గమనించినట్లు తెలిపారు. జింక్ లోప నివారణ కోసం జింక్ సల్ఫేట్ 2 గ్రాములు, ఇనుప ధాతు లోపం నివారణ కోసం అన్నబేది 5 గ్రాములు, సిట్రిక్ ఆమ్లం 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుతం వరి నాట్లు వేసుకుంటున్న రైతులు సిఫార్సు చేసిన ఎరువుల్లో ఒకటో వంతు నత్రజని, మొత్తం భాస్వరం, పొటాష్ ఎరువులు చివరి దమ్ములో వేయాలని సూచించారు. నాట్లు వేసిన తర్వాత ప్రతి 2 మీటర్లకు 20 సెం.మీ కాలి బాటలు వేసుకోవడం ద్వారా ఎరువులు పిచికారీ చేసుకునేందుకు సులభంగా ఉంటుందన్నారు. ఈ సీజన్‌లో జింక్ లోపం నివారణ కోసం జింక్ సల్ఫేట్‌ను ఎకరాకు 20 కిలోలు ఆఖరి దమ్ములో వేయాలన్నారు. పంట ఎదుగుదల దశలో జింక్ లోపం గమనిస్తే జింక్ సల్ఫేట్ 0.2 గ్రాములు (2 గ్రాములు, లీటరు నీటికి) పిచికారీ చేయాలన్నారు. సమస్య తీవ్రత ఆధారంగా ఐదు రోజుల వ్యవధిలో మళ్లీ పిచికారి చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం మామిడి తోటల్లో తేనె మంచు పురుగు, పక్షి కన్ను తెగులు, బూడిత తెగులు నివారణ కోసం 0.3 మి.లీ ఇమిడా క్లోప్రిడ్, 2.0 మి.లీ క్లోరోథలోనిల్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. పచ్చి పూత దశలోని తోటల్లో 0.3 గ్రాములు థయోమిథాక్సామ్ లేదా 1.5 మి.లీ బుప్రోఫెజిన్, 2.0 హెక్సాకొనజోల్ లేదా 2 గ్రాములు మాంకోజెబ్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని పేర్కొన్నారు. అలాగే పశువుల్లో బ్రూసెల్లోసిస్ బ్యాక్టీరియా వ్యాధి, గొర్రెలు, మేకల్లో పీపీఆర్ వైరస్ ఆశించేందుకు అవకాశం ఉందన్నారు. వ్యాక్సిన్‌లు వేయించుకోవాలని సూచించారు.

క్రైం కార్నర్

రూ.5 కోట్లకు ఐపీ..!

- అధిక వడ్డీ ఎరవేసి అప్పులు
- ఎస్పీ కార్యాలయం వద్ద బాధితుల ఆందోళన


ఆందోళన చేస్తున్న బాధితులు

అనంతపురం క్రైం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆరు నెలల్లో రెట్టింపు డబ్బులు ఇస్తామని చెప్పడంతో అత్యాశకు పోయారు. పైసా, పైసా పోగేసి కూడబెట్టుకున్న సొమ్మును వారి చేతిలో పెట్టారు. మొదట్లో 'రిటర్న్స్' బాగా ఉండటంతో చాలా మంది డబ్బులు ఇచ్చారు. ఇలా ఇచ్చిన మొత్తం రూ.5 కోట్లు దాటింది. సొమ్ము వసూలు చేసిన ఇద్దరు సోదరులు ఐపీ పెట్టారు. దీంతో బాధితులు శుక్రవారం లబోదిబో మంటూ ఎస్పీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. తమకు న్యాయం చేయాలని విన్నవించారు. కళ్యాణదుర్గం మండలంలోని బాలవెంకటాపురం గ్రామానికి చెందిన ఖాసీంవలి, ఇమామం వలి సోదరులు అదే ఊరిలో కిరాణం దుకాణాన్ని నిర్వహించేవారు. అధిక వడ్డీ ఇస్తామని ఊరిలోని పలువురితో డబ్బులు వసూలు చేశారు. కొన్ని నెలలు బాగానే చెల్లించారు. దీంతో మిగిలినవారికి నమ్మకం కుదిరింది. దాదాపు 150 మంది రూ.5 కోట్ల వరకు వడ్డీకి ఇచ్చారు. వీరందరికీ సోదరులు ఇద్దరూ ఐపీ నోటీసులు పంపించారు. ఉన్నది పల్లెటూరిలోనే అయినా, బాలవెంకటాపురంలో ఖాసీం, ఇమామ్ సోదరులు విలాసవంతమైన ఇళ్లు, ఖరీదైన ఫర్నిచర్ ఏర్పాటు చేసుకున్నారని బాధితులు తెలిపారు. తాము ఇచ్చిన సొమ్ముతో 70 తులాల బంగారం, అనంతపురంలో ప్లాట్లు కొన్నారని అన్నారు. డ్వాక్రా మహిళల పొదుపు సొమ్ము, రుణాలు, ఉపధి పనుల్లో సంపాదించిన కూలి డబ్బులు, అమ్మ ఒడి సొమ్ము, బంగారాన్ని తాకట్టుపెట్టి తీసుకున్న సొమ్మును ఖాసీ సోదరులకు ఇచ్చి నిండా మునిగిపోయామని పలువురు కంటతడి పెట్టారు. నాలుగేళ్ల నుంచి డబ్బులు తీసుకోవడం ప్రారంభించారని, మొదట్లో అధిక వడ్డీ, ఆ తరువాత సాధారణ వడ్డీ ఇచ్చారని, చివరకు ఐపీ నోటీసులు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది క్రితమే కళ్యాణదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశామని, దీంతో వారు ఊరు విడిచి అనంతపురం చేరారని తెలిపారు.

ఉపాధి కోసం వెళ్లిన వ్యక్తి మృతి


సంధ్యేనాయక్ (ఫైల్)

నల్లచెరువు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం తెలంగాణ రాష్ట్రం హైదారాబాద్‌కు వెళ్లిన మండలంలోని బాలేపల్లి తండా నివాసి మూడే సంధ్యే నాయక్ (60) ప్రమాదవశాత్తు మరణించాడు. సంధ్యేనాయక్‌కు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరికి వివాహాలు అయిపోయాయి. ఏడాది క్రితం సంధ్యేనాయక్ తన భార్య శాంతమ్మతో కలిసి ఉపాధి కోసం హైదారాబాద్ వెళ్లారు. అక్కడ శుక్రవారం బాత్ రూంలో స్నానం చేస్తుండగా.. జారి పడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో ఆయన అక్కడికక్కడే మరణించాడు. మృతదేహానికి స్వగ్రామానికి తీసుకువస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

శవమై తేలిన అదృశ్యమైన మహిళ

- హత్య చేసినట్లు ఒప్పుకున్న భర్త


సురేఖ(ఫైల్)

గుంతకల్లుటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన మహిళ మండలంలోని పాతకొత్తచెరువు గ్రామ సమీపంలోని చెరువులో శుక్రవారం శవమై తెలింది. టూటౌన్ పోలీసులు, మృతురాలి బంధువులు తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా ఆగ్రహారానికి చెందిన ఆర్‌ఎంపీ రఘురాముడు మండలంలోని దోసులుడికి గ్రామంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివాసముంటున్నాడు. అతడి భార్య సురేఖ(29) పట్టణంలోని క్రెడిట్ యాక్సిస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఫీల్డ్ వర్కర్‌గా పనిచేస్తున్నారు. ఈనెల మూడోతేదీ మధ్యాహ్నం పాత గుత్తిరోడ్డులోని మణికంఠ గ్యాస్ వద్ద తన భర్త రఘురాముడుకు డ్యూటీ పనిమీద దౌల్తాపురం వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. సాయంత్రమైన ఇంటికి రాకపోవడంతో, రఘురాముడు పలు చోట్ల గాలించి, చివరికి నాలుగో తేదీన టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అయితే రఘురాముడే తన భార్యను హత్య చేసి ఉంటాడని మృతురాలి బంధువులు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో మూడు రోజుల కిందట రఘురాముడును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. తానే ఆమెను హత్యచేసి సంచిలో ఉంచి పాతకొత్తచెరువు గ్రామ చెరువులో పడేసినట్లు చెప్పాడు. పోలీసులు శుక్రవారం మధ్యాహ్నం అక్కడికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రూ అప్ పాపం జగన్‌దే: కాలవ


మీడియాతో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

అనంతపురం డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ట్రూఅప్ చార్జీల భారం మాజీ సీఎం జగన్‌రెడ్డిదేనని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. చేసిన పాపాన్ని కప్పిపుచ్చుకునేందుకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారని ఆరోపించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరితో కలిసి శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఆరు నెలలుగా ప్రజా రంజక పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే వైసీపీ రాజకీయ కుట్రలకు తెరతీస్తోందని విమర్శించారు. వైసీపీ పాలనలో రైతులను విస్మరించారని, వారిపై కపట ప్రేమను చూపుతూ ఇటీవల ధర్నా చేశారని అన్నారు. తాజాగా కరెంటు చార్జీల పెంపు పేరుతో నిరసన చేపట్టడం ఆ పార్టీకి ఆత్మహత్యా సదృశ్యమేనని అన్నారు. విద్యుత్ చార్జీల పెంపెతో సీఎం చంద్రబాబు పరిపాలనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వైసీపీ పాలకులు చేసిన పాపాలే దీనికి కారణమని అన్నారు. అవసరం లేకపోయినా, అధిక ధరలకు విద్యుత్‌ను కొనుగోలు చే శారని అన్నారు. చౌకగా వస్తున్న విద్యుత్‌ను కాదని, బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు కరెంటు కొనుగోలు చేసినందుకే విద్యుత్ రంగం అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వంపై అనుమానాలు, అపోహలు సృష్టిస్తున్నారని విమర్శించారు. తప్పుడు వివరాలతో ప్రజలను మోసం చేసేందుకు ధర్నాలు నిర్వహించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అంతకు ముందు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి మౌనం పాటించి, సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ ప్రచార కార్యదర్శి కూచి హరి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గంజే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సిరుల వాన..!

- ఫలించిన దానిమ్మ రైతుల కష్టం
- నాలుగు రోజుల్లోనే రూ.60 వేలు పెరిగిన ధర
- ప్రస్తుతం టన్ను ధర రూ.1.20 లక్షలకుపైనే..
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

దానిమ్మ పంటకు మంచిరోజులు వచ్చాయి. గతనెలలో ఉన్న ధర డిసెంబరు ప్రథమార్థం పూర్తయ్యేసరికి అమాంతం పెరిగింది. నాలుగురోజుల్లోనే టన్నుపై ఏకంగా రూ.60వేలు పెరిగింది. దీంతో రైతుల ఆనందానికి హద్దు లేకుండాపోయింది. ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడం, కాయలు సైతం నాణ్యతగా ఉండటం రైతులకు బాగా కలిసి వస్తోంది. పుట్లూరు, యల్లనూరు మండలాల్లో సుమారు 2100 ఎకరాల విస్తీర్ణంలో రైతులు దానిమ్మ పంటను సాగు చేశారు. పుట్లూరు మండలంలోని పుట్లూరు, పి. చింతలపల్లి, బాలాపురం, కోమటికుంట్ల, కందికాపుల, కొండుగారికుంట, రంగమనాయునిపల్లి, మడ్డిపల్లి, యల్లనూరు మండలంలోని వేములపల్లి, దంతలపల్లి, కృష్ణాపురం, తిమ్మంపల్లి, బుక్కాపురం, చింతకాయమంద, కొడవండ్లపల్లి, పీఎం కొండాపురం, కల్లూరు, కూచివారిపల్లి, బొప్పేపల్లి తదితర గ్రామాల్లో ఎక్కువగా సాగుచేస్తున్నారు.

- యల్లనూరు/పుట్లూరు, (ఆంధ్రజ్యోతి)


విరగ్గాసిన దానిమ్మ

రూ.లక్ష దాటిన టన్ను ధర

స్తబ్దుగా ఉన్న దానిమ్మ ధర ఒకేసారిగా భారీగా పెరిగింది. టన్నుపై దాదాపు రూ.60వేలు పెరిగింది. ప్రస్తుతం టన్ను ధర రూ.1.20లక్షల నుంచి 1.40లక్షలు పలుకుతోంది. దానిమ్మ కాయలు నాణ్యతనుబట్టి కొన్నిగ్రామాల్లో టన్ను రూ.1.40లక్షలకు కొనుగోలు చేస్తున్నారు. రెండునెలల క్రితం టన్ను రూ.60వేల నుంచి 70వేల వరకు ధర పలికింది. ఎకరాకు పెట్టుబడి సుమారు లక్షరూపాయల నుంచి లక్షన్నవరకు వస్తోంది. పురుగమందుల పిచికారీకి సీజన్‌బట్టి మరో రూ.50వేలు పెట్టుబడి అదనంగా వస్తుంది. దిగుబడి ఆశించిన స్థాయిలో వస్తోంది. ఎకరాకు సరాసరి కాపు బాగా వస్తే 5టన్నుల నుంచి 8 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

కంటికి రెప్పలా కాపాడుకోవాలి

దానిమ్మ పంట చాలా సున్నితమైనది. దీనికి చీడపీడలు ఎక్కువగా సోకుతాయి. కాపు వచ్చినప్పటి నుంచి మూడునెలలపాటు కన్నబిడ్డలా పంటను చూసుకోవాల్సి ఉంటుంది. మే, జూన్ మాసాల్లో ఒకసారి, జూలై, ఆగస్టులో ఒకసారి, నవంబరు, డిసెంబరులో మరోసారి కాపు వస్తుంది. వీటిలో మే, జూన్ మాసాల్లో వచ్చే కాపును మాత్రం పసిపిల్లలను చూసుకున్నట్లు చూసుకోవాల్సి ఉంటుంది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా నష్టపోవాల్సి వస్తుంది. ప్రతి నాలుగురోజులకు ఒకసారి పురుగు మందులను పిచికారి చేయాలి. ఈ కాలంలో వర్షాలు పడితే తప్పనిసరిగా మరోసారి పిచికారి చేయాలి. లేకపోతే చెట్లకు తెగులు, ఎండుతెగులు, దానిమ్మ కాయలపై మచ్చలు వస్తాయి. దీని ప్రభావం దిగుబడిపై పడుతుంది.

ఇతర రాష్ట్రాల్లో దిగుబడి లేకపోవడంతోనే...

గతంలో దానిమ్మపంట మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఎక్కువగా పండేది. ఆ దిగుబడులు తెలుగు రాష్ట్రాలకు సైతం వచ్చేవి. ఈ ఏడాది



ఇతర రాష్ట్రాల్లో ఆశించినంత దిగుబడులు లేకపోవడంతో ఇక్కడ ధర పెరిగింది. కర్ణాటక, మహారాష్ట్రల్లో నెలన్నర ముందుగానే పంటకాలం ముగియడంతో దిగుబడులు లేవు. ఇది మన రైతులకు బాగా కలిసొచ్చినట్లు అయింది. పుట్లూరు, యల్లనూరు మండలాల్లో పండించిన పంటను ఎక్కువగా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. ఇక్కడి దానిమ్మ కాయలు నాణ్యతగా ఉండటంతో డిమాండ్ పెరుగుతోంది. ఈధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని పలువురు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ధర ఇలాగే కొనసాగాలి



గతంలో దానిమ్మ పంట సాగుచేసి ధరలు లేక నష్టపోయా. ఈ ఏడాది ధర ఆశాజనకంగా ఉంది. ఇంకా నెలన్నరపాటు ధర కొనసాగితే బాగుంటుంది. నాలుగు ఎకరాల్లో దానిమ్మపంట సాగుచేశా. పంట ఇంకా నెలన్నరలో చేతికి వచ్చే అవకాశం ఉంది. ఈ పంటను జాగ్రత్తగా చూసుకోవాల్సి ఉంటుంది. ఈ ధరలు ఇలాగే కొనసాగితే రైతుల అప్పులు తీరే అవకాశం ఉంది.

- శివశంకర్‌రెడ్డి, రైతు, కందికాపుల

ధర పెరగడంతో లాభాలు



ఈ ఏడాది వర్షాలు అధికంగా రావడంతో దిగుబడులు కూడా తక్కువగా ఉన్నాయి. దీనికితోడు తెగుళ్లు కూడా అధికంగా ఉన్నాయి. ఈ ఏడాది ఎండుతెగులు అధికమైంది. గత నెలరోజుల నుంచి నిలకడగా ఉన్న మార్కెట్ ఒక్కసారిగా పెరిగిపోయింది. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం కిలోపై రూ.20నుంచి 30రూపాయలు అధికంగా వచ్చే అవకాశం కనిపిస్తోంది.

-లేపాక్షిరెడ్డి, తిమ్మంపల్లి

గంజాయి ముఠా అరెస్టు

- 4.72 కిలోల మత్తు పదార్థం స్వాధీనం


నిందితులను తరలిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న ముఠాను జిల్లా పోలీసులు శుక్రవారం అరెస్టు చేసినట్లు వెల్లడించారు. వారి నుంచి 4.720 కిలోల గంజాయి, 10 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్ట్ వివరాలను జిల్లా ఎస్పీ జగదీష్ శుక్రవారం మీడియా సమావేశంలో వెల్లడించారు.

మహారాష్ట్ర నుంచి అనంతకు...

గంజాయిపై కూటమి సర్కారు ఉక్కుపాదం మోపుతుండటంతో సరఫరా దారులు రూటు మార్చారు. మహారాష్ట్రలోని సోలాపూర్, కురువాడి తదితర ప్రాంతాలనుంచి రైలుద్వారా తీసుకువచ్చి అనంతపురంలో విక్రయిస్తున్నారు. నగర శివారు ప్రాంతాలు, వ్యసనపరులైన విద్యార్థులకు సరఫరా చేస్తున్నారు. ఆరుగ్రాముల పొట్లాలుగా మార్చి ఒక్కో పొట్లం రూ.500 చొప్పున విక్రయిస్తున్నారు. మహారాష్ట్రలో కిలో గంజాయి రూ.15వేలకు కొనుగోలుచేసి అనంతపురంలో కిలో రూ.83వేలకు విక్రయిస్తున్నారు.

పట్టుబడ్డ ముఠా వివరాలు

పోలీసులకు పట్టుబడిన వారిలో అనంతపురానికి చెందిన తాడిపత్రి సయ్యద్ మహమ్మద్ నవాజ్(23), గౌస్ మొహిద్దీదన్ అలియాస్ తొత్తి(21), ఎర్రోళ్ల జస్వంత్ అలియాస్ బిట్టు(21), కడవకల్లు మురళీధర్ అలియాస్ చింటు(26), షేక్ మహమ్మద్ గౌస్ అలియాస్ పిట్టు(26),


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జగదీష్

తేజస్వరూప్(19), వెంకటేష్(24) ఉన్నారు. ధర్మవరానికి చెందిన మామిళ్ల రాజేష్‌కుమార్(26), కట్టుబడి మురళీ(30), తోపాటు ఒక మైనర్ ముఠాగా ఏర్పడ్డారు. ఈ ముఠాలో తాడిపత్రి సయ్యద్ మహమ్మద్ నవాజ్ కీలకంగా వ్యవహరిస్తున్నాడు. మహారాష్ట్రలో గంజాయిని కొనుగోలుచేసి అనంతపురం తరలించడం, వ్యసనపరులకు సరఫరా చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాడు. ముఠాలోని వెంకటేష్‌పై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటికే గంజాయికేసు ఉంది.

గంజాయి, 10 సెల్ ఫోన్లు స్వాధీనం...

గంజాయి విక్రయ ముఠా సమాచారం అందుకున్న బుక్కరాయసముద్రం సీఐ కరుణాకర్, ఇన్‌చార్జ్ సీఐ హేమంత్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ ఎస్సై రాజశేఖర్ రెడ్డిలు రంగంలో దిగారు. ముఠా సభ్యులను అరెస్ట్ చేసి 4.720 కిలోల గంజాయి, 10 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మౌత్ ఫ్రెషనర్స్, ఖాళీ ఓసీలు, ఐ డ్రాప్స్‌ను సీజ్‌చేశారు. గంజాయి, మాదక ద్రవ్యాలను ఎక్కడైనా విక్రయించినా, వినియోగించినా సమాచారం చేరవేసేందుకు టోల్‌ఫ్రీ నెంబర్ 1972 లేదా స్థానిక పోలీసులకు 100/112 నెంబర్‌కు తెలియజేయాలని ఎస్పీ సూచించారు.

వార్తలోనే సమాధానముంది కదా..!

జిల్లాలో పేకాట సాగుతున్న వైనంపై శుక్రవారం 'తోటలో పేకాట' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. గంజాయి ముఠా అరెస్టును వివరిస్తున్న ఎస్పీని మీడియా ప్రతినిధులు దీనిపై ప్రశ్నించారు. ఇందుకు ఆయన స్పందిస్తూ.. వార్తలోనే సమాధానముంది కదా అని పేర్కొన్నారు.

చంద్రన్న బీమా పోర్టల్ ఓపెన్

అనంతపురం అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చంద్రన్న బీమా పోర్టల్ శుక్రవారం ఓపెన్ అయ్యింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది మార్చి నుంచి రైతు పోర్టల్ బంద్ అయింది. అప్పటి నుంచి అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి సంబంధించిన దరఖాస్తును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు అవకాశం లేకుండాపోయింది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఆరుమాసాల తర్వాత చంద్రన్న బీమా పోర్టల్‌ను ఓపెన్ చేయడంతో బాధిత రైతు కుటుంబాల నిరీక్షణకు తెరపడినట్లైంది.

రైతు పోర్టల్ బంద్ అయిన నాటి నుంచి ఇప్పటి దాకా 41 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వారి కుటుంబాలకి ప్రభుత్వం రూ.ఏడు లక్షల పరిహారం అందజేస్తోంది. సార్వత్రిక ఎన్నికల నుంచి పోర్టల్ బంద్ కావడంతో వీఆర్వో ఆన్‌లైన్‌లో రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు రిజిస్టర్ చేయలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటి దాకా 41 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, వారి వివరాలు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి ఆఫ్‌లైన్ ద్వారా పంపినట్లు సమాచారం.

రేపు ఎస్జీటీ మెగా గ్రాండ్ టెస్ట్

కొత్తచెరువు డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏపీ డీఎస్సీ ఎస్జీటీ అభ్యర్థులకు ఈనెల 29న కొత్తచెరువులో మెగా గ్రాండ్ టెస్ట్ (మోడల్ పరీక్ష) నిర్వహించనున్నట్లు వదాన్య సొసైటీ ఫౌండర్ అశోక్ పడపాటి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 2వేల మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా.. 1800 మంది హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారన్నారు. హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోనివారు www.vadaanya.org వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు. ఐదు కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు.

జిల్లాలో చిరుజల్లులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం చిరుజల్లులు పడ్డాయి. అనంతపురం, కళ్యాణదుర్గం, నార్పల, యాడికి, బెళుగుప్ప, కూడేరు, పుట్లూరు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. జిల్లాలోని 18 మండలాల్లో గురువారం చిరుజల్లులు పడ్డాయి. గార్లదిన్నె, యల్లనూరులో 4.2 మి.మీ వర్షపాతం నమోదైంది. బుక్కరాయసముద్రంలో 3.4, కూడేరు 3.2, గుత్తి 2.4, అనంతపురం, శింగనమల 2.2, రాప్తాడు 2.0 మి.మీ వర్షపాతం నమోదైంది.

పాపం.. పది విద్యార్థులు

- అర్ధాకలితోనే ప్రత్యేక తరగతులకు హాజరు
- మధ్యాహ్న భోజనంతోనే రోజంతా గడుపుతున్న వైనం
- అల్పాహారం, స్నాక్స్ అందించాలని విన్నపాలు

కదిరిలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థినులు



కదిరి అర్బన్, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వందరోజుల ప్రణాళికలో భాగంగా ఈనెల 1వ తేదీన వీటిని ప్రారంభించారు. ఆ మేరకు విద్యార్థులు ఉదయం 8 గంటలకే పాఠశాలకు చేరుకోవాలి. సాయంత్రం 5 గంటల వరకు ఉండాలి. రోజుకు ఒక సబ్జెక్టు టీచరు తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలకు పక్క గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు అంత ఉదయాన్నే ఇళ్లలో అల్పాహారం సిద్ధంకాక, ఖాళీ కడుపుతో వస్తున్నారు. మధ్యాహ్న భోజనం పెట్టేవరకు ఆకలితో అలమటిస్తున్నారు. సాయంత్రం 5గంటల వరకు పాఠశాలలో ఉండి, తరువాత వారు ఇంటికి చేరేసరికి రాత్రవుతోంది. అప్పటి వరకు ఆకలితో అలమటిస్తున్నారు. ఇలా.. అర్ధాకలితో చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. పాఠశాలలోనే ఉదయం అల్పామారం, సాయంత్రం స్నాక్స్ ఇస్తే బాగుంటుందని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రోజంతా మధ్యాహ్న భోజనంతోనే..

ఉన్నత పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు మాత్రం వంద రోజుల ప్రనాళికలో భాగంగా ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేశారు. ఆ మేరకు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు రోజూ రెండుగంటలపాటు ప్రత్యేక తరగతులు ఉంటాయి. ఆ మేరకు వారు ఉదయం 8గంటలకు పాఠశాలకు హాజరవుతారు. వారిలో కొంతమంది అల్పాహారం తిని బడికి వస్తున్నారు. మరికొంతమంది తినకుండానే ఖాళీ కడుపుతో బడికి చేరుతున్నారు. అల్పాహారం తినకుండా వచ్చిన విద్యార్థులు మధ్యాహ్నం వరకు ఆకలితోనే ఉండాల్సి వస్తోంది. పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజనం చేసి, సాయంత్రం ఇంటికెళ్లేవరకు అలాగే అర్ధాకలితో ఉండాల్సి వస్తోంది. దీంతో చదువుపై ఏకాగ్రత పెట్టలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వంతోపాటు దాతలు అల్పాహారం అందించేందుకు ముందుకు రావాల్సిన అవసరముంది.

దూర ప్రాంతాల వారికి ఇబ్బందులు

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులకు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 గంటలకు పాఠశాలకు రావాలంటే దూరప్రాంతాలవారు గంట ముందుగానే ఇళ్లనుంచి బయలుదేరాల్సి ఉంటుంది. సాయంత్రం ఇంటికెళ్లే సరికి ఆరుగంటలవుతోంది. అప్పటివరకు ఆకలితో అలమటించాల్సి వస్తోంది. ఈకారణంగా కొంతమంది విద్యార్థులు చదువుపై దృష్టి సారించలేకపోతున్నారు. సాయంత్రం ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యే ముందు అల్పాహారం అందిస్తే ఉత్సాహంగా చదువుతారు.


సెలవు రోజుల్లో సమస్య

విద్యాశాఖ వందరోజుల ప్రణాళికను ఆది, రెండో శనివారాలు ఇతర సెలవు రోజుల్లో సైతం అమలు చేస్తుండడంలో విద్యార్థులకు ఆర్టీసీ బస్సుపాసులు చెల్లడంలేదు. ఆ రోజుల్లో మధ్యాహ్నం భోజనం అందడంలేదు. చార్జీలు పెట్టుకుని వస్తూ ఇళ్ల నుంచి భోజనం తెచ్చుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వమే సెలవు రోజుల్లో ఏజెన్సీల ద్వారా భోజనం పెట్టాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇందుకోసం ప్రభుత్వమే ప్రత్యేక నిధులు విడుదల చేస్తే బాగుంటుందని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. పలుచోట్ల ఉపాధ్యాయులే సొంత నిధులు వెచ్చించి, అల్పాహారం అందిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు అల్పాహారం అందించడానికి ముందుకు రావాల్సిన అవసరం ఉంది. దీంతో విద్యార్థుల ఆకలి తీరి, చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టగలరు.

స్టడీ మెటీరియల్ ఇస్తే మేలు

పది పరీక్షల్లో ఉత్తీర్ణతే లక్ష్యంగా రూపొందించిన వంద రోజుల ప్రణాళికను దృష్టిలో పెట్టుకుని సిలబస్ పూర్తి చేయడానికి ఉపాధ్యాయులు కుస్తీ పడుతున్నారు. గతంలో జిల్లా పరిషత్ ద్వారా పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించేవారు. ఇందులో ముఖ్యమైన ప్రశ్నపత్రాలుండేవి. సాధారణ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడానికి ఎంతగానో ఉపయోగపడేవి. ఈ ఏడాది పాఠశాలలకు మెటీరియల్ అందలేదు. వందరోజుల ప్రణాళికకు ముందే స్టడీ మెటీరియల్ అందజేస్తే బాగుంటుందని టీచర్లు, విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు.


విద్యార్థులకు అల్పాహారం అందించాలి



పదిలో మంచి మార్కులు సాధించేలా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం మంచిదే. వారు ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలో ఉండడంతో ఆకలితో చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. సెలవు రోజుల్లో నిర్వహించడం కారణంగా మధ్యాహ్న భోజనం ఇంటినుంచి తెచ్చుకోవాల్సి ఉంది. దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అల్పహారం అందించేలా చర్యలు తీసుకోవాలి.

- బాబ్‌జాన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

ప్రజాప్రతినిధులు, దాతలు ముందుకు రావాలి



పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించడానికి ప్రజాప్రతినిధులు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి. ప్రభుత్వ ఉద్దేశం మంచిదైనా.. అల్పాహారం అందకపోవడంతో విద్యార్థులు చదువుపై దృష్టి సారించలేకపోతున్నారు. కొన్ని పాఠశాలల్లో టీచర్లే.. విద్యార్థులకు అల్పాహారం అందించడం అభినందనీయం.

- మహేంద్ర, ఏఐఎస్ఎఫ్, కదిరి నియోజకవర్గ కార్యదర్శి

సంక్షిప్తం

ఘనంగా శ్రీనివాస కల్యాణం



శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పాల్గొన్న గోవింద మాలధారులు



అనంతపురం కల్చరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం గోవింద మాలధారుల ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్చారణతో కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తుల గోవిందనామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. మాలధారులు రమేష్, రమణ, నాగరాజు, ఆంజనేయులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా చంద్రమౌళి

రామగిరి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓగా చంద్రమౌళి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఆజాద్ డిప్యుటేషన్‌పై బొమ్మనహాళ్‌కు బదిలీ అయ్యారు. కణేకల్ ఈఓఆర్‌డీగా పనిచేస్తున్న చంద్రమౌళి ఎఫ్ఏసీ ఇన్‌చార్జ్‌గా రామగిరికి బదిలీ అయ్యారు.

నోటీస్ బోర్డులో ఎస్సీ కులాల జాబితా

అనంతపురం రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల నోటీస్ బోర్డుల్లో ఎస్సీ కులాల జాబితాను ప్రదర్శించినట్లు ఎంపీడీఓ దివాకర్ తెలిపారు. స్థానిక ఎస్సీ కులస్థులు సంబంధిత సచివాలయాల్లోకి వెళ్లి జాబితాను సరిచూసు కోవచ్చన్నారు. అభ్యంతరాలుంటే ఈనెల 31వతేదీలోగా సంబంధిత పంచాయతీ కార్యదర్శికి గానీ, వీఆర్వోకు గానీ తెలియజేయవచ్చని ఎంపీడీఓ తెలిపారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ

రామగిరి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో 2023-24 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై శనివారం నుంచి సామాజిక నుంచి నిర్వహిస్తున్నట్లు ఏపీఓ సూర్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఆర్‌పీ చంద్రమోహన్ ఆధ్వర్యంలో తనిఖీలు జరుగుతాయన్నారు. అందుకు సహకరించాలని ఆయన కోరారు.

డ్రై డే తప్పక పాటించాలి



గ్రామంలో పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి

రాప్తాడు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు తెలిపారు. ఆయన శుక్రవారం మండలంలోని అయ్యవారిపల్లిలో డ్రైడే కార్యక్రమాన్ని అకస్మికంగా పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి నీటి తొట్టెలను, పరిసరాలను పరిశీలించారు. అనంతరం రాప్తాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, ల్యాబ్‌ను పరిశీలించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్వైజర్లు నూర్‌బాషా, శ్రీధర్‌మూర్తి, పీహెచ్‌సీ సూపర్వైజర్లు నరసింహులు, హెల్త్ అసిస్టెంట్ నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

గార్లదిన్నె, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెనకచెర్ల డ్యాం గ్రామంలో వెంకటలక్ష్మి అనే కిరాణ కొట్టు నిర్వాహకురాలిపై దాడిచేసిన కేసులో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెనకచెర్ల డ్యాం గ్రామంలో కుళ్లాయప్ప, వెంకటలక్ష్మి దంపతులు కిరాణాకొట్టు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదే గ్రామానికి చెందిన బోయ శివ కుమారుడు వినయ్ గురువారం రూ.20 తీసుకుని కురుకురే కొనుగోలు చేసేం దుకు వెళ్లాడు. కొట్టు యజమాని కుళ్లాయప్ప చిల్లర లేదు రెండు రూపాయలు తీసుకురమ్మని వెనక్కు పంపాడు. దీంతో బోయ శివ కొట్టు వద్దకు వచ్చి కుళ్ళాయప్పతో గొడవకు దిగాడు. గ్రామస్తులు ఇద్దరికి సర్దిచెప్పడంతో గొడవ సద్దుమనిగింది. బోయ శివ గురువారం రాత్రి మద్యం తాగి కుళ్ళాయప్ప ఇంటిపైకి దాడికి దిగాడు. ఆ సమయంలో కుళ్ళాయప్ప ఇంట్లో లేకపోవడంతో వెంకటలక్ష్మిపై రాయితో దాడి చేశాడు. ఈ దాడిలో ఆమెకు రక్తపు గాయాలు కావడంతో స్థానికులు అస్పత్రికి తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బోయ శివపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ముద్దాయికి ఏడాది జైలు శిక్ష

రాప్తాడు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం కేసులో ముద్దాయి అయిన ఈడిగ గోపాలకృష్ణకు ఏడాది జైలు శిక్ష, రూ. 10 వేలు జరిమానా విధిస్తూ అనంతపురం స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సృజనకుమార్ శుక్రవారం తీర్పు వెల్లడించారని రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు. మరూరు జాతీయ రహదారిపై 2017లో మూగ నరసింహులు (46) రోడ్డు దాటుతుండగా బొలేరో వాహన డ్రైవర్ ఈడిగ గోపాలకృష్ణ వాహనంతో ఢీకొన్నాడు. నరసింహులు మృతి చెందాడు. మరూరుకు చెందిన కదిరన్న కుమారుడు నారాయణ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ ధరణిబాబు కేసు నమోదు చేశారు. కేసుపై విచారణ జరిపిన న్యాయాధికారి నిందితుడికి శిక్ష ఏడాది జైలు శిక్ష, రూ. 10 వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

వానతో వరిరైతు కష్టాలు



కోతకు వచ్చిన వరిపంట



ఆరబెట్టిన వరిధాన్యంపై టార్పాలిన్లు కప్పిన దృశ్యం

కనగానపల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు అన్నదాతకు నష్టం తెచ్చిపెడుతున్నాయి. పంట చేతికందే సమయంలో ఎడతెరపిలేకుండా కురుస్తు న్న వర్షాలతో వరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వేరుశనగ రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంట తడిసిపోయి కనీసం పశు గ్రాసం దక్కలేదు. అప్పుల పాలయ్యారు. అది మరవకనే వరి రైతులు అకాల వర్షాలకు నష్టపోతున్నారు. రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో రోడ్డుపై ఆరబెట్టిన వరి దాన్యం తడసి పోతోంది. ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్న చందంగా వరి రైతుల పరిస్థితి నెలకొంది. కోత కోయకుంటే పొలంలోనే వరి నేలకొరుగుతోందని, కోతకోస్తే వర్షానికి నానిపోతోందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. దీంతో వరినూర్పిడి యంత్రాలకు అధిక బాడుగులు అవుతున్నాయని, పెట్టుబడులు కూడా చేతికందడం లేదని రైతులు వాపోతున్నారు.



గతంలో కొత్త బీసీకాలనీలో రోడ్డు దుస్థితి ఇలా...



ప్రస్తుతం సీసీరోడ్డు వేసిన తరువాత...

రోడ్లకు మరమ్మతులు.. ప్రజల హర్షం

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో చెన్నేకొత్తపల్లిలోని పరిటాల రవీంద్ర కొత్త బీసీ కాలనీలో రోడ్లు అధ్వానంగా ఉండేవి. వానొస్తే.... కనీసం నడిచి వెళ్లడానికి కూడా వీలులేని పరిస్థితి. రోడ్డపై ఏర్పడిన పెద్దపెద్ద గుంతలతో కాలనీవాసులు అవస్థలు పడుతుండేవారు. గత వైసీపీ పాలకులు రోడ్ల మరమ్మతులను గాలికివదిలేశారు. వానాకాలంలో పెద్దపెద్ద గుంతల్లో నీరు నిల్వఉండటంతో వాహన చోదకులు చాలా ఇబ్బందులుపడేవారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం వచ్చిన ఆర్నెల్లలో నే ఆ కాలనీలో పలు రోడ్లకు మహర్దశ వచ్చింది. రూ.57.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

మాజీ ప్రధాని మన్మోహన్ మృతి తీరని లోటు

● ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆర్థిక వేత్త, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం తీరనిలోటని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మన్మోహన్‌సింగ్ మరణంతో దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పో యిందన్నారు. ఆయన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు దేశంలో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రధాన మంత్రిగా ఆయన దేశ ప్రజలకు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఆయన మృతిపై ఎమ్మెల్యే ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

దేశాన్ని ఆర్థిక అగ్రగామిగా నిలిపిన మహనీయుడు

●మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ● మాజీ ప్రధాని మన్మోహన్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న శైలజానాథ్, కాంగ్రెస్ నాయకులు

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచదేశాల్లో భారత దేశాన్ని ఆర్థిక అగ్రగామిగా నిలిపిన మహనీయుడు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ కొనియాడారు. నగరంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ నాయకులు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సంతాప కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి శైలజానాథ్, ఇతర నాయకులు మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం శైలజానాథ్ మాట్లాడుతూ.. అనేక రకాల ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టి అన్ని రంగాలను గాడిన పెట్టగలిగారని గుర్తు చేసుకున్నారు. ఆయన మొదట జిల్లాకు వచ్చి ఉపాధి హామీ పథకం ప్రారంభించారని, మరో సారి పదేళ్ల తరువాత పరిశీలించారని గుర్తు చేశారు. పార్టీ రాష్ట్ర మైనార్టీ విభాగం అధ్యక్షుడు దాదాగాంధీ, నాయకులు శివశంకర్ యాదవ్, వాసు, శర్మాస్‌వలి, కొండారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● శింగనమల: మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు కాంగ్రెస్ నాయకులు ఘన నివాళులర్పించారు. శింగనమల ఆర్టీసీ బస్టాండ్ అవరణంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రావ్ చరణ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాలర్పించారు. కాంగ్రెస్ నాయకులు గంగారాజు, రఫి, జాన్, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో తప్పిదాలను సరిచేయండి

● రెవెన్యూ సదస్సులో పలువురు రైతుల వినతులు

అనంతపురం రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీ సర్వే తప్పిదాలను సరి చేయాలని పలువురు రైతులు రెవెన్యూ అధికారుల దృష్టికి తెచ్చారు. మండలంలోని అక్కంపల్లి పంచాయతీలో తహసీల్దార్ మోహన్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలు సమస్యలపై రైతుల ద్వారా 30 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో భూసర్వే, రస్తాకు సంబంధించి పది ఫిర్యాదులు వచ్చాయి. రీసర్వే తప్పిదాలు, ఇతరత్రా వాటిపై ఇరవై ఫిర్యాదులు వచ్చాయి. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... రీసర్వేలో జరిగిన తప్పిదాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ సందీప్‌కృష్ణ, వీఆర్వోలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: గ్రామ రెవెన్యూ సదస్సులను రైతులం దరు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బండారు ఈరమ్మ తెలిపారు. మండల పరిధిలోని కోటంక గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.... రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. రస్తా, సర్వే, వివిధ భూ సమస్యలపై రైతులు అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ దామోదరమ్మ, సర్వేయర్, ఆర్ఐ, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

డాక్టరు హేమలతకు ఐఎంఏ నేషనల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టరు హేమలత

అనంతపురం టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజనాస్పత్రి ఇన్‌చార్జ్ ఆర్ఎంఓగా కొనసాగుతున్న డాక్టరు హేమలత ఐఎంఏ నేషనల్ ప్రెసిడెంట్ అప్రిసియేషన్ అవార్డు అందుకున్నారు. ఆమె జిల్లా ఐఎంఏ అధ్యక్షురాలిగా, స్టేట్ ఐఎంఏ ఉమెన్ డాక్టర్స్ వింగ్ చైర్‌పర్సన్‌గా అనేక సేవా కార్యక్రమలు నిర్వహిస్తూ గుర్తింపు పొందారు. ఈ నేపథ్యంలో ఆమెకు ఐఎంఏ నేషనల్ ప్రెసిడెంట్ అవార్డుకు ఎంపిక చేశారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ఏఎంఏ నాటకాన్ - 2024 ఉత్సవ్ కార్యక్రమంలో శుక్రవారం డాక్టరు హేమలతకు ఐఎంఏ నేషనల్ సీనియర్ నాయకుడు కేతాన్‌దేశాయ్, జాతీయ అధ్యక్షుడు డాక్టరు భానశాలి, నేషనల్ సెక్రెటరి డాక్టరు సర్కారిదత్త, ఏపీ ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నందకిషోర్, రాష్ట్ర సెక్రెటరీ డాక్టరు సుబాష్‌చంద్రబోస్ చేతులమీదుగా అవార్డు అందజేశారు. ఈ అవార్డుతో ప్రజల సంక్షేమంపై మరింత బాధ్యత పెరిగిందని ఆమె పేర్కొన్నారు.

విద్యుత్ చార్జీలు పెంచిన ఘనుడు జగన్‌రెడ్డి

● వైసీపీ వారే ధర్నా చేయడం సిగ్గుచేటు: ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను పెంచిన ఘనుడు జగన్‌రెడ్డిని, అయితే ఇప్పుడు ఆ పార్టీ వారే ధర్నా చేయడం సిగ్గు చేటని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. వైసీపీ శ్రేణులు జగన్ ఇంటి ఎదుట ధర్నా చేస్తే బాగుంటుదని హితవు పలికారు. విద్యుత్ చార్జీల పెంపు అంటూ వైసీపీ చేపట్టిన నిరసనపై ఎమ్మెల్యే శనివారం పత్రికా ప్రకటనలో మాట్లాడారు. వైసీపీ అధికారం చేపట్టిన నెల రోజుల్లోనే సీఎం జగన్ విద్యుత్ చార్జీలు పెంచి షాక్ ఇచ్చాడన్నారు. ఒక్కసారి 15 శాతం విద్యుత్ చార్జీలు పెంచిన ఘనత జగన్‌రెడ్డిదే అన్నారు. టీడీపీ 2019లో అధికారం కోల్పేయే నాటికి మిగులు విద్యుత్ రాష్ట్రంగా వైసీపీకి అప్పగించిందన్నారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం నిర్వాకంతో రాష్ట్రం వేల మెగా వాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను కోల్పోయిందన్నారు.

రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలి

● ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశం



సమీక్షలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్

అనంతపురం టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు సీరియస్‌గా ఆలోచించాలని ఇన్‌చార్జ్ కలెక్టరు శివనారాయణశర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో రోడ్డుప్రమాదాల నివారణపై శుక్రవారం జిల్లాస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టరు మాట్లాడుతూ.. మూడు నెలల్లోనే జిల్లాలో రెండు పెద్ద ప్రమాదాలు జరిగాయన్నారు. ప్రమాదాలలో పలువురు చనిపోవ డం బాధాకరమన్నారు. భవిష్యత్తులో అలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ రమణ మూర్తి, డీటీసీ వీర్రాజు, డీపీఓ నాగరాజునాయుడు, పీఆర్ఎస్ఈ, జహీర్‌ఇస్లామ్, ఆర్టీసీ ఆర్ఎం సుమంత్, డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీ దేవి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, హైవే టెక్నికల్ మేనేజరు మురళీకృష్ణ, ఆర్అండ్‌బీ ఈ.ఈ జేపీరెడ్డితోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

జిల్లాలో పరిశ్రమలను ఏర్పాటుచేసే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని అధికారులను కలెక్టరు(ఎఫ్ఏసీ) శివనారాయణశర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పారిశ్రామికరంగం బలోపేతం అయినపుడే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. వివిధ ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేర్చాలన్నారు. అనంతరం 2020-23కు సంబంధించి 27 పరిశ్రమలకు గాను రూ.239.45 లక్షలు సబ్సిడీ సొమ్ము మంజూరుకు ఆమోదం తెలిపారు. సమావేశంలో పరిశ్రమలశాఖాధికారి శ్రీధర్, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, కమర్షియల్ డిప్యూటీ కమిషనర్ మురళీమనోహర్, జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్ కుమార్, ఎల్డీఎం నరసింహారావుతో పాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సాయి ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం షష్టిపూర్తి జరుపుకున్న 170 మంది దంపతులు శుక్రవారం అశోక్‌నగర్‌లోని రమా సమేత సత్యనారాయణస్వామి దేవాలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం ఆచరించారు. ఈ సందర్భంగా మహామంగళహారతి నివేదన అనంతరం అన్నసంతర్పణ చేశారు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అంబటి ఫణిరాజ్, సాయిట్రస్టు సభ్యులు పద్మలత, నారాయణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'మట్టి మట్టి' పుస్తకావిష్కరణ



'మట్టి మట్టి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతు జీవన చిత్రణ 'మట్టి మట్టి' కవితా సంపుటి అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. కవి దర్భశయనం శ్రీనివాసాచార్య రచించిన 'మట్టి మట్టి' కవితా సంపుటి పుస్తక ఆవిష్కరణ సభను శుక్రవారం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని కామర్స్ సెమినార్ హాల్‌లో నిర్వహించారు. స్పందన అనంత కవుల వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రొఫెసర్ శ్రీరాములు నాయక్, సీనియర్ కవులు తూముచెర్ల రాజారామ్, అంకె శ్రీనివాస్, శాంతినారాయణ, ఉప్పరపాటి వెంకటేశులు, తరిమెల అమరనాథరెడ్డి, రియాజుద్దీన్, చెట్ల ఈరన్న, తెలుగు అధ్యాపకుడు యోగేశ్వరనాయుడు, అంకె మదన్‌మోహన్ పాల్గొన్నారు.

వైసీపీ శ్రేణులు.. జగన్ ఇంటి వద్ద ధర్నా చేయాలి

● గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్



మాట్లాడుతున్న గౌస్‌మొద్దీన్

అనంతపురం అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపిన జగన్‌రెడ్డి ఇంటి వద్దనే వైసీపీ నాయకులు ధర్నాలు చేయాల్సి ఉందని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల అరాచకపాలనతో అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేశారన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం విద్యుత్ రంగాన్ని నాశనం చేశారని, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే కూటమి ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు.

ఉనికి కోసమే వైసీపీ ర్యాలీలు

● మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్

అనంతపురం రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తమ ఉనికిని కా పాడుకోవడం కోసమే వైసీపీ వివిధ కార్యక్రమాలతో ర్యాలీలు చేస్తోందని మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్ విమర్శించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మాట్లాడారు. గతం ఏ ముఖ్యమంత్రి పెంచని విధంగా విద్యుత్ బిల్లులు పెంచి ప్రజల నడ్డివిరిచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దక్కిందన్నారు. ప్రజలపై అంత ప్రేముంటే..గత ప్రభుత్వంలో కరెంటు బిల్లుల పెరుగుదలకు తీసుకున్న నిర్ణయాలను, జీఓలను రద్దు చేయాలని పోరాటం చేయండంటూ హితవుపలికారు.

ప్రజలను వెంటాడుతున్న వైసీపీ పాపాలు

● తెలుగు రైతు నాయకులు



మాట్లాడుతున్న తెలుగురైతు నారాయణస్వామి

అనంతపురం రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కూటమి జన సునామిలో వైసీపీ కొట్టుకుపోయిన ప్పటికీ, గత ఐదేళ్లలో ఆ ప్రభుత్వం చేసిన పాపాలు రాష్ట్ర ప్రజలను వెంటాడుతున్నాయని తెలుగు రైతు రాప్తాడు నియోజకవర్గం అధ్యక్షుడు నారాయణ స్వామి అన్నారు. కరెంటు బిల్లుల పెరుగుదలపై వైసీపీ చేపట్టిన ర్యాలీపై టీడీపీ నాయకులు మారినేని వెంకటరాముడు, గోపాల్, ఆటో వెంకటరాముడు తదితరులతో కలసి ఆయన శుక్రవారం కురుగుంటలోని టీడీపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ప్రజలపై విద్యుత్ బిల్లుల భారం పడుతోందన్న నాయకులు.. గత ఐదేళ్లలో నిద్రపోయారా అని మండిపడ్డారు. అప్పటి జీఓల కారణంగా నేడు విద్యుత్ బిల్లులు పెరిగాయన్న విషయాన్ని మరచిపోవద్దని హితవు పలికారు.

ఆరోపణలకు ఆధారాలు ఉన్నాయా..?

● సబ్‌యూనిట్ అధికారిని విచారించిన డీఆర్ఓ

అనంతపురం టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్యశాఖాధికారి డాక్టరు ఈబీ దేవి అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఉరవకొండ సబ్ యూనిట్ అధికారి కోదండ రామిరెడ్డి ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీనిపై కలెక్టర్ స్పందించి విచారణకు డీఆర్ఓ మలోల ను నియమించారు. విచారణలో భాగంగా డీఆర్ఓ శుక్రవారం ఫిర్యాదు చేసిన సబ్‌యూనిట్ అధికారిని కలెక్టరేట్ లోని తన చాంబర్‌కు పిలిపించారు. ఆరోపణలకు ఆధారాలు ఉన్నాయా.. అంటూ ఆరా తీశారు. తన వద్ద ఉన్న ఆధారాలను డీఆర్ఓకు అప్పగించినట్లు ఫిర్యాదుదారుడు తెలిపారు.

రేపు జిల్లా టెన్నీకాయిట్ జట్ల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా జూనియర్ బాల, బాలికల టెన్నీకాయిట్ జట్ల ఎంపిక పోటీలను ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రంగస్వామి తెలిపారు. ప్రభుత్వ న్యూటౌన్ జూనియర్ బాలుర జూనియర్ కళాశాలలో ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. 2006 ఏప్రిల్ 1 తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడాసామగ్రి, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. వివరాలకు సెల్ ఫోన్ నంబరు 9652117133ను సంప్రదించాలని కోరారు.

సాహితీ సదస్సును విజయవంతం చేయండి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ, విమలా శాంతి సాహిత్య సాంస్కృతిక సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న సాహితీ సదస్సును జయప్రదం చేయాలని విమలాశాంతి సాహిత్య సాంస్కృతిక సేవాసమితి వ్యవస్థాపకుడు డాక్టర్ శాంతినారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. సదస్సు ఈనెల 29న ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహిస్తామన్నారు. 'రాయలసీమ సాహిత్యం-బహుజన జీవితం' అనే అంశంపై నిర్వహించనున్న ఈ సదస్సుకు వివిధ ప్రాంతాలనుంచి సాహితీవేత్తలు హాజరై ప్రసంగిస్తారన్నారు. సాహిత్యాభిమానులు విరివిగా పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి: వైసీపీ



రాప్తాడులో ఏఈకి వినతి పత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపుపై నిరసనగా వైసీపీ పోరుబాట కార్యక్రమాన్ని శుక్రవారం రాప్తాడులో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. వైసీపీ స్థానిక నాయకులతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ కార్యాలయం వద్దకు వెళ్లి విద్యుత్ శాఖ అధికారుల కు వినతిపత్రం అందజేశారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● శింగనమల: రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీలకు 200 యూనిట్ ఉచిత విద్యుత్ అలాగే కొనసాగించాలని వైసీపీ శింగనమల నియోజకర్గం సమన్వయకర్త వీరాంజనేయులు అన్నారు. విద్యుత్ చార్జీల పెంపుపై శింగనమల సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం వైసీపీ సమన్వయకర్త వీరాంజనేయులు, పార్టీ సీనియర్ నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఎంపీపీ యోగేశ్వరి, నాయకులు బొమ్మన శ్రీరామిరెడ్డి, ఎన్వీ నారాయణ, బాలకృష్ణ, మదిరేపల్లి రవీంద్రరెడ్డి, నిదన వాడ అమర్‌నాథ్‌రెడ్డి, మల్లికార్జున రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లా పరీక్షల్లో ఎనిమిది మంది డిబార్

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ నిర్వహిస్తున్న లా పరీక్షల్లో ఎనిమిది మంది విద్యార్థులను డిబార్ చేసినట్లు పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. పరీక్షా కేంద్రాలను శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించినట్లు ఆయన తెలిపారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న వారిని డిబార్ చేశామన్నారు. డిగ్రీ ప్రథమ సెమిస్టర్ పరీక్షల్లోనూ ఇద్దరని బుక్‌చేశామని పేర్కొన్నారు.

కేంద్రమంత్రి వ్యాఖ్యలపై 30న భారీ ర్యాలీ

● వామపక్ష నాయకులు



సమావేశమైన వామపక్ష నాయకులు

అనంతపురం విద్య, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ నెల 30న వామపక్షాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వామపక్ష నాయకులు పేర్కొన్నారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవా రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఏసురత్నం మాట్లాడారు. అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా వామపక్షాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఈనెల 30న నిరసన ప్రదర్శన చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాకేంద్రంలో క్లాక్‌టవర్ నుంచి గాంధీ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామిరెడ్డి, బాలరంగయ్య, రామాంజినేయులు, నారాయణస్వామి, కేశవరెడ్డి, అల్లిపీరా, రమణయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌కు ఘనస్వాగతం



సీకే పల్లిలో మాజీ సీఎం జగన్

చెన్నేకొత్తపల్లి/రాప్తాడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి చెన్నేకొత్తపల్లి, రాప్తాడులో శుక్రవారం వైసీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఆయన పులివెందుల నుంచి రోడ్డు మార్గాన బెంగళూరు వెళ్తున్న విషయం తెలుసుకు న్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున స్థానిక జాతీయ రహదారిపై ఆయా జంక్షన్ల వద్దకు చేరుకున్నారు. కాన్వాయ్ అక్కడికి చేరుకోగానే పలువురు నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఆయన శ్రేణులకు అభివాదం చేశారు.

క్లుప్తంగా..

కళాశాల అభివృద్ధికి కృషి చేయండి



మాట్లాడుతున్న డాక్టర్ ఆర్. డేవిడ్‌కుమార్‌స్వామి

గుంతకల్లు టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్కేపీ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని కళాశాల విద్య కడప ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ ఆర్ డేవిడ్‌కుమార్‌స్వామి పేర్కొన్నారు. ఎస్కేపీ కళాశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాశాలకు న్యాక్‌ఏ గ్రేడ్ సాధించినందుకు, అటానమస్ హోదాను పొందినందుకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, ఆధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరోజులోనే ఎస్‌ఐ రిలీవ్

యల్లనూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల ఎస్‌ఐగా గురువారం బాధ్యతలు చేపట్టిన రామిరెడ్డి శుక్రవారం మధ్యాహ్నం రిలీవ్ అయి వెళ్లిపోయారు. ఈయన ఒక్కరోజు మాత్రమే పనిచేశారు. ఉన్నతాధికారుల నుంచి వీఆర్‌లో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు రావడంతో ఆయన ఏఎస్‌ఐకి బాధ్యతలు అప్పగించి వెళ్లినట్లు తెలిసింది.

కారుకు నిప్పు

కళ్యాణదుర్గం రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మారెంపల్లి కాలనీలో ఉన్న హరిప్రకాష్ అనే వ్యక్తికి చెందిన స్కార్పియో కారుపై శుక్రవారం తెల్లవారుజామున దుండగులు పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. 23వ వార్డు కౌన్సిలర్ అర్చన భర్త హరి ప్రకాష్ ఈమేరకు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి క్లూ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తు చేసుకోండి

కళ్యాణదుర్గం రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వృత్తి నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ పురపాలక సంఘం పరిధిలోని వివిధ రకాలైన సేవలు అందించే వారు ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ, గీజర్, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్, హెయిర్ కటింగ్, పెయింటర్లు, బ్యూటీషియన్‌కు సంబంధించి సేవలందించే వారందరికీ నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఎస్ఎస్‌డీసీ ద్వారా శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం సర్టిఫికెట్ ఇస్తామని తెలిపారు. ఈ నెల 31వ తేదీ లోపు వివరాలను పురపాలక సంఘంలో నమోదు చేసుకోవాలన్నారు.

హౌసింగ్ కార్యాలయాన్ని తెరవండి

విడపనకల్లు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హౌసింగ్ కార్యాలయాన్ని ఎప్పుడు తెరుస్తారు అంటూ విడపనకల్లు టీడీపీ బీసీ యువనాయకులు ఉప్పర నాగరాజు ప్రశ్నించారు. శుక్రవారం హౌసింగ్ కార్యాలయానికి వచ్చిన నాయకులకు తాళం వేసి ఉండడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ 10 రోజుల నుంచి హౌసింగ్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఒక్క అధికారి కనిపించటం లేదన్నారు. కార్యాలయానికి ఎప్పుడు చూసిన తాళం వేసి ఉంటుందన్నారు.

మహిళల అభివృద్ధే ధ్యేయం

బెళుగుప్ప, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం కిశోర్ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టిందని ఐసీడీఎస్ సీడీపీవో శ్రీదేవి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కిశోర్ వికాసం పథకంపై అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, డాక్టర్ కార్తీక్‌రెడ్డి, సూపర్‌వైజర్లు సురేఖ, అరుణ, సూపరింటెండెంట్ వెంకటరమణ పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

పెద్దపప్పూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తురకపల్లికి చెందిన చాకలి బయన్న (60) అనే వృద్ధుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బయన్న కొన్నేళ్లుగా కుటుంబ సభ్యులకు దూరంగా ఒంటరిగా జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఒంటరి జీవితాన్ని భరించలేక ఇంటిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

బొమ్మనహాళ్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వన్నళ్లి గ్రామ శివారులో శుక్రవారం పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ నబీరసూల్ తెలిపిన వివరాల మేరకు.. వన్నళ్లి గ్రామానికి జూదరులు పేకాట ఆడుతుండగా తమ సిబ్బందితో దాడులు నిర్వహించామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాయదుర్గం రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో శనివారం రెండుగంటల పాటు అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ ఏఈ బాలచంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 74 ఉడేగోళం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాల్లో అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

కణేకల్లు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా టీడీపీ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతోంది. ఇప్పటికే ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు టీడీపీ సభ్యత్వ నమోదును పోటాపోటీగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల కన్వీనర్ లాలెప్ప, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఆనంద్‌రాజ్ ఆధ్వర్యంలో రాంనగర్, బండేమూల, ఇందిరమ్మ కాలనీలలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, చాంద్‌బాషా పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల స్థలంలో సర్వే

కుందుర్పి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలకు దాత పామరాతి గంగమ్మ ఇచ్చిన ఐదు ఎకరాల పొలంలో శుక్రవారం సర్వే పనులను చేపట్టారు. ఆ స్థలానికి హద్దులు చూపించి సంబంధిత పత్రాలను జిల్లా అధికారులకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ పోతన, సర్వేయర్లు టీడీపీ నాయకులు మల్లికార్జున, రామ్మూర్తి, స్థల దాత కుమారుడు శరత్ పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలపై కేసు నమోదు

పుట్లూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాలవేముల గ్రామంలోని గంగాధర్‌గుప్తాకు చెందిన వ్యవసాయ భూమిలో మట్టి తవ్వకాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయన పొలంలో యల్లనూరు మండలం బొప్పేపల్లి, వాసాపురం గ్రామాలకు చెందిన రామాంజనేయులు, నరేష్ అక్రమంగా మట్టి తవ్వారని ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు. గంగాధర్ హైదరాబాద్‌లో ఉన్న విషయం తెలుసుకున్న ఇద్దరు ఎక్స్‌కవేటర్‌తో తవ్వి టిప్పర్లతో రవాణా చేశారన్నారు.

రైతులు ఉరుకులు.. పరుగులు..!

● చిరుజల్లులు.. వాతావరణం మార్పులతో కలవరం ● ధాన్యాన్ని కాపాడుకోవడానికి అవస్థలు



బొమ్మనహాళ్ వద్ద ధాన్యపు రాశులపై కప్పిన పట్టలు.. బెళుగుప్ప వద్ద కందులు తడిసిపోకుండా పట్టలు కప్పిన రైతులు

బొమ్మనహాళ్/బెళుగుప్ప, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించిన పంట ఉత్పత్తులను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. బొమ్మనహాళ్ మండలంలో గురువారం నుంచి చిరుజల్లులు కురుస్తుండడంతో రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. కల్లాల్లో ధాన్యం రాశులపై పట్టలు కప్పి వర్షం నీరు ధాన్యం రాశులు వద్దకు రాకుండా చుట్టూ మట్టితో కట్టలు వేశారు. ఇంటిల్లిపాది పొలాల్లోనే తెల్లవారే వరకూ కాపలా ఉన్నారు. రెండు రోజులుగా మండలంలో చిరుజల్లులు వర్షం కురుస్తుండడంతో రైతులు ధాన్యాన్ని రక్షించుకునేందుకు నానా కష్టాలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలు ఉండడంతో రహదారులు, ఖాళీ ప్రదేశాల్లో ధాన్యం రాశులు వేశారు. కోత కోసిన ధాన్యం ఆరబెట్టకపోతే కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం సాకుగా చూపుతుండడంతో తమ పాలిట శాపంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు సడలించి ధాన్యాన్ని నేరుగా కొనుగోలు చేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు. బెళుగుప్ప మండలంలోనూ రైతులు తమ ధాన్యాన్ని పట్టలు కప్పి కాపాడుకుంటున్నారు. తుఫాను ప్రభావం కంది రైతులను కలవరపెడుతోంది. కంది పంట కోసి ఆరబెట్టుకున్నారు. వర్షంతో తడిసిపోకుండా అవస్థలు పడుతున్నారు. పొలాల్లో పంటలను అలాగే వదిలేస్తే తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని ఆందోళన చెందుతున్నారు. ముందుగానే కాపుకొచ్చిన కాయలలో విత్తనాలు నాశనం అవుతాయని వాపోతున్నారు. పరదాలు కప్పి ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకెళితే గింజలు నల్లబారుతాయని, తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

కాలేజీ భవనాన్ని పరిశీలించిన టీడీపీ నాయకులు

గుంతకల్లు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ పరిపాలనలో వినియోగించకుండా పాడుపెట్టిన మైనారిటీ కళాశాల నూతన భవనాన్ని టీడీపీ నాయకులు పరిశీలించారు. శుక్రవారం నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి ఆధ్వర్యంలో పట్టణంలోని అల్లీపీరా మఠం వద్ద టీడీపీ హయాంలో నిర్మించిన ఉర్దూ కళాశాల, ఉర్దూ హాస్టల్ భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ 2016లో టీడీపీ హయాంలో నిర్మించిన రెండు భారీ భవనాలను ప్రారంభించకుండా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. నిధులను తెచ్చి శిథిలమైన ఈ రెండు భవనాలను సిద్ధంచేసి ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, పత్తి హిమబిందు, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, మస్తానప్ప, మహమ్మద్ షరీఫ్, రంగన్న, ప్రభుత్వ ఖాజీ రజాఖ్‌పీర్ ఖాద్రీ, మస్తాన్, ఇంతియాజ్, అంజి, ఖాజా, దాదా, రమాదేవి, గౌసియా పాల్గొన్నారు.



మైనారిటీ కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

విద్యుత్ చార్జీలను తగ్గించాలి : వైసీపీ



గుంతకల్లులో డీఈఈకి వినతి పత్రం ఇస్తున్న వైసీపీ నాయకులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

: పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని వైసీపీ నాయకులు పేర్కొన్నారు. వైసీపీ ఆధ్వర్యంలో పలుచోట్ల ఆ పార్టీ నాయకులు చేపట్టారు. శుక్రవారం గుంతకల్లు పట్టణం టీవీ స్టేషన్ నుంచి ఆలూరు రోడ్డులోని విద్యుత్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి అక్కడ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచడంతో పేద, మధ్య తరగతి ప్రజలు అల్లాడిపోతున్నారని అన్నారు. అనంతరం విద్యుత్ డీఈఈ నాగేంద్రకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భవాని, వైస్‌చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్, మాజీ చైర్మన్లు రామలింగ, జింకల రామాంజినేయులు, నాయకులు చినబాబు, సుంకప్ప, అబ్దుల్‌బాసిద్ పాల్గొన్నారు. ఉరవకొండ పట్టణంలోని ఉరగాద్రి కల్యాణమండపం నుంచి విద్యుత్ శాఖ కార్యాలయం వరకూ ఆ పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పేరుతో రూ.15వేల కోట్లు భారం మోపిందన్నారు. అనంతరం ఏడీఈ భాస్కర్ వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నరసింహులు, నారాయణరెడ్డి, దేవిబాయి, యోగేంద్రరెడ్డి పాల్గొన్నారు. తాడిపత్రిలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి ట్రాన్స్‌కో ఏడీ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. పెంచిన చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. యాడికిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు రమేష్‌నాయుడు, చంద్రమోహన్, నాగరాజు, రాంమోహన్ పాల్గొన్నారు.

వైసీపీ పదిసార్లు పెంచింది : టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఐదేళ్లలో పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచారని ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, టీడీపీ నాయకులు రేగాటి నాగరాజు, విజయ్ భాస్కర్, నూతేటి వెంకటేశులు, మారయ్య పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ చార్జీల పెంపుపై వైసీపీ నాయకులు ఆందోళన చేయడంపై వారు మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ చార్జీల భారానికి ప్రధాన కారణం గత వైసీపీ ప్రభుత్వ విధానాలే అన్నారు. గత రెండేళ్లలో చార్జీల పెంపునకు పీఆర్సీ ప్రతిపాదించిన వెంటనే అనుమతించిన విషయాన్ని జగన్ మరిచిపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఆందోళనల పేరుతో నాటకాలు ఆడుతున్నారన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ, నాయకులు రామాంజనేయులు, తిమ్మప్ప, కేశవానంద, గోవిందు, రాంబాబు, వెంకటేష్, సీతారాములు, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు

గుంతకల్లు టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోని మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు వీరభద్రస్వామి, సీఐటీయూ మండల కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ చెల్లించాలని, 60 సంవత్సరాలు పూర్తయిన కార్మికులు, రిటైర్డ్ అయిన అవుట్ సోర్సింగ్ కార్మికుల స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న అరియర్స్, లీవ్ డబ్బులను చెల్లించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్ లేకపోవడంతో ఆయన చాంబర్ తలుపులకు వినతి పత్రాన్ని అతికించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.శ్రీనివాసులు, నాగరాజు, సీఐటీయూ నాయకులు నరసయ్య చిన్నకొండయ్య, చిన్న, వాసు పాల్గొన్నారు.

శ్రీధరఘట్టలో ఇంటి పట్టాల పంపిణీ

బొమ్మనహాళ్/గుంతకల్లు టౌన్/శెట్టూరు/బెళుగుప్ప/రాయదుర్గంరూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): బొమ్మనహాళ్ మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో అర్హులైన 15 మంది లబ్ధిదారులకు తహసీల్దార్ మునివేలు, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. సద్వినియోగం చేసుకొని ఇళ్లు కట్టుకోవాలని వారు తెలిపారు. చంద్రబాబు హయాంలో అధికారులు ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించే విధానం తీసుకొచ్చారని బలరాంరెడ్డి అన్నారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు మల్లికార్జున, వీఆర్‌ఓలు నరసింహమూర్తి, సుజాత, దేవదాయశాఖ అధికారి ఓబన్న, టీడీపీ నాయకులు ఎర్రిస్వామి, తిప్పేస్వామి, రవిచంద్రసాగర్ పాల్గొన్నారు. గుంతకల్లు మండలంలోని అయ్యవారిపల్లిలో నిర్వహించి రెవెన్యూ సదస్సులో తహసీల్దారు రమాదేవి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి సారయ్య, రెవెన్యూ, దేవదాయశాఖ పాల్గొన్నారు. శెట్టూరు మండలంలోని యాటకల్లు రెవెన్యూ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 14 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి తెలిపారు. బెళుగుప్ప మండలం అంకంపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ షర్మిల వినతులు స్వీకరించారు. రాయదుర్గం మండలంలోని డి.కొండాపురం గ్రామం నందు రెవెన్యూ సదస్సు కార్యక్రమానికి తొమ్మిది దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు.



ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ మునివేలు

విద్యార్థుల బకాయిలు చెల్లించాలి: ఏఐఎస్‌ఎఫ్



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

రాయదుర్గం రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న వివిధ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతరాయుడు, కుళ్లాయిస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద భిక్షాటన చేస్తూ వినూత్నంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన డబ్బులు విడుదల చేయాలన్నారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ జీఓ నెంబరు 77 రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి డబ్బులు రాలేదని విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్న కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక, సర్టిఫికెట్లు తీసుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఆంజనేయులు, వెంకటనాయక్, వంశీ, మంజునాథ్, శశికుమార్, సచిన్, కార్తీక్, రాజు, మాంతేష్, శశి, యశ్వంత్, ఏసు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు నివాళులు



గుంతకల్లులో మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

గుంతకల్లుటౌన్/ఉరవకొండ/కుందుర్పి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు మృతికి శుక్రవారం పలుచోట్ల నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు. గుంతకల్లు పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మహేంద్ర ఆధ్వర్యంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గాలి మల్లికార్జున, ఆలం నవాజ్, నబీరసూల్, నరసన్న, తాయిదాస్, రామచంద్ర, సువర్ణ, జిలాన్, జయన్నకుమార్ పాల్గొన్నారు. దేశం గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయిందని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి పేర్కొన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల సంతాపం తెలియజేశారు. ఆర్బీఐ గవర్నర్, ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రసాద్, శ్రీన, ఓబులేశు, అబ్బాస్, సుధాకర్ పాల్గొన్నారు. కుందుర్పి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ బొజ్జప్ప ఆధ్వర్యంలో సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తిప్పేస్వామి, మారుతి, గోపాల్, అంజనేయులు పాల్గొన్నారు.

బియ్యం అవకతవకలపై చర్యలు తీసుకోండి



కదిరి శ్రీకాంత్‌రెడ్డి

తాడిపత్రి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అవకతవకలపై చర్యలు తీసుకోవాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదిరి శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. జనసేన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రేషన్ గోడౌన్‌లో తనిఖీలు నిర్వహించగా ప్రతి బస్తాకు కిలో నుంచి రెండు కిలోల వరకు తూకాల్లో తేడాలు ఉన్నాయని తెలిపారు. గతంలో కూడా ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్నారు. డీలర్లు కిలో నుంచి రెండు కిలోల తక్కువ ఇస్తున్నారని లబ్ధిదారులు చెబుతున్నారని వివరించారు. ఈ విషయాన్ని గోడౌన్ ఇన్‌చార్జ్ శంకర్ దృష్టికి తీసుకువెళ్లినా ఆయన స్పందించలేదని పేర్కొన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారికి కూడా విషయాన్ని తెలియజేశామన్నారు. గతంలో స్థానిక ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకువెళ్లామని ఆయన తెలిపారు. రెండునెలలైనా సమస్య పరిష్కారం కాలేదని, అదేవిధంగా పంపిణీ చేస్తున్నారని అన్నారు. ఒక్కొక్క డీలర్‌కు వంద కిలోల దాకా తక్కువ వస్తున్నాయన్నారు. ఈ విషయంపై పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకువెళతామని హెచ్చరించారు.

ఆరోపణలకు ఆధారాలు ఉన్నాయా..?

- సబ్‌యూనిట్ అధికారిని విచారించిన డీఆర్‌ఓ

అనంతపురం టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ ఈబీ దేవి అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఉరవకొండ సబ్‌యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీనిపై కలెక్టర్ స్పందించి విచారణకు డీఆర్‌ఓ మలోలను నియమించారు. విచారణలో భాగంగా డీఆర్‌ఓ శుక్రవారం ఫిర్యాదు చేసిన సబ్‌యూనిట్ అధికారిని కలెక్టరేట్‌లోని తన చాంబర్‌కు పిలిపించారు. ఆరోపణలకు ఆధారాలు ఉన్నాయా.. అంటూ ఆరా తీశారు. తన వద్ద ఉన్న ఆధారాలను డీఆర్‌ఓకు అప్పగించినట్లు ఫిర్యాదుదారుడు తెలిపారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

రాయదుర్గం రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై చేసిన అవమానకరమైన వ్యాఖ్యలను సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

పీఏబీఆర్‌లోకి పెరిగిన వరద

కూడేరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు ఇన్ ఫ్లో పెరిగింది. తుంగభద్ర డ్యాం నుంచి 530 క్యూసెక్కులు, హంద్రీ నీవా నుంచి 450 క్యూసెక్కుల నీరు పీఏబీఆర్ డ్యాంలోకి చేరుతోంది. దీంతో డ్యాంలో నీటి మట్టం 3.360 టీఎంసీలకు చేరింది. కుడికాలువకు 700 క్యూసెక్కుల నీరు విడుదల చేయడంతో ఇన్‌ఫ్లో ఆధారంగా ఔట్ ఫ్లో ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కుడి కాలువలో డ్యాం నుంచి 25వ కిలోమీటర్‌లో దాదాపు రెండు వందల క్యూసెక్కుల నీరు వృథాగా వెళ్తోంది. కూడేరులో దాదాపు 500 క్యూసెక్కుల నీరు మాత్రమే కాలువలో ప్రవహిస్తున్నట్లు తెలుస్తోంది. డ్యాం నుంచి 112 కిలోమీటర్ల దూరంలోని తాడిమర్రి మండలం ఆగ్రహారం చెరువుతోపాటు మరో చెరువులోకి 50 శాతం నీరు చేరిందని అధికారులు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థులు

కూడేరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అంతర్‌రాష్ట్ర స్కూల్ గేమ్స్‌లో కూడేరు కేజీబీవీ విద్యార్థులు సత్తాచాటారు. రైల్వే కోడూరు జూనియర్ కళాశాలలో రెండ్రోజుల పాటు జరిగిన పోటీల్లో అండర్ 14, 17, 18 విభాగంలో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జనవరి 2 నుంచి 6వ తేదీవరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు నిషా, వర్షిణీ, అక్షిత, నవ్యశ్రీ, పూజిత, చందన, లోకేశ్వరి, రహల్యా ఎంపికైనట్లు ఎస్‌ఓ ఉమాదేవి, పీఈటీ అంజలాబాయి తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో 8 మంది విద్యార్థులు బంగారం పతకాలు సాధించడంతో ఎస్‌ఓ ఉమాదేవి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అభినందించారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

రాయదుర్గం రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయంపల్లి వద్ద ఏర్పాటు చేసిన సిద్దేశ్వరస్టీల్ ఫ్యాక్టరీలో ఐదు నెలల క్రితం సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన నాగరాజు కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఐ తాలూకా కార్యవర్గ సభ్యుడు కొట్రేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో బాధిత కుటుంబసభ్యులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్రేష్ మాట్లాడుతూ.. ఫ్యాక్టరీ యజమానులు న్యాయం చేస్తామంటూ మాయమాటలు చెప్పి ఇప్పుడు పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు తిప్పేస్వామి, మృతుని కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 12 మేక పిల్లలు మృతి

గుత్తి రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కలచెరువు గ్రామశివారులో శుక్రవారం సాయంత్రం కుక్కల దాడిలో 12 మేక పిల్లలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన ఆదినారాయణ, బాలన్న అనే గొర్రెల కాపర్లు గ్రామ శివారులోని గుట్ట వద్ద మేక పిల్లలను గుడిలో వేసి జీవాలను మేపడానికి వెళ్లారు. గూటిలోకి కుక్కలు దూరి మేక పిల్లలపై దాడి చేసి చంపేశాయి.

ఘనంగా కరిబసవ ఆరాధనోత్సవం

ఉరవకొండ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గవిమఠంలో 7వ పీఠాధిపతి కరిబసవ రాజేంద్రస్వామి ఆరాధనోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, అష్టోత్తర పూజను చేశారు. పూజల్లో ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, సహాయ కమిషనర్ రాణి, ఆదోని చౌకిమఠం పీఠాధిపతి కల్యాణస్వామి, ఏజెంట్ రాజన్న పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల భూసమస్యలు పరిష్కరించాలి

బెళుగుప్ప, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎస్సీ ఎస్టీల భూసమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆ సంఘం జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాకే హరి శుక్రవారం తహసీల్దార్ షర్మిలకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత, గిరిజనుల భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు.

విద్యుత్ స్తంభాన్ని తొలగించండి

విడపనకల్లు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలకి గ్రామంలో కురుబ మల్లికార్జున ఇంటి ముందున్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని టీడీపీ నాయకులు హనుమంతురెడ్డి, శ్రీరాములు పేర్కొన్నారు. శుక్రవారం మాళాపురం గ్రామంలోని విద్యుత్ కార్యాలయం చేరుకున్న టీడీపీ నాయకులు ఏఈ సత్యంతో వాగ్వాదం చేశారు.